# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 148 | శనివారం 31, జనవరి 2026 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com


## సర్కారు స్కూళ్ల విద్యార్థులకు అల్పాహారం

ఆర్థిక వనరులు సమకూరితే త్వరలోనే అమలు
ఇప్పటికే సీఎం రేవంత్ సెగ్మెంట్లో ప్రారంభం
కామన్ స్కూల్ ఉంటేనే
ఉమ్మడి కుటుంబం గా సమాజం
రంగారెడ్డి జిల్లా మొగిలిగిద్ద
సభలో డిప్యూటీ సీఎం భట్టి

02



## ఫీజు రీయింబర్స్ మెంట్ జాప్యానికి వివరణ ఇవ్వండి

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
ఫీజు రీయింబర్స్‌మెంట్
బకాయిల సాకుతో ఇబ్బందులు పెట్టొద్దు
ప్రైవేట్ కాలేజీల తీరుపై హైకోర్టు సీరియస్
సమస్య పరిష్కారం కు
ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయండి

02







# డైవర్షన్ పాలిట్రిక్స్

మున్సిపల్ ఎన్నికల
ముందు కాంగ్రెస్ ప్లాన్
డైవర్ట్ అయిన బీఆర్ఎస్
మున్సిపల్ ఎన్నికలపై
దృష్టి పెట్టలేని పెద్దలు

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగిన వేళ, అధికార కాంగ్రెస్ , ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మధ్య సాగుతున్న రాజకీయం ఒక ఆసక్తికరమైన మలుపు తీసుకుంది. రాష్ట్ర రాజకీయాల్లో ప్రస్తుతం డైవర్షన్ అనే పదం మార్మోగిపోతోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ ..మిగతా 3లో






# మొక్కుల మేడారం..!

భక్తులకు వనదేవతల దర్శనం
ఒకే రోజు లక్షకు పైగా మంది హాజరు
గిరిజన దేవతలను దర్శించుకున్న గవర్నర్, కవిత
నేడు వనంలోకి గిరిజన దేవతలు

**మేడారం, (ప్రజాస్వరం):**

మేడారం.. భక్తిపారవశ్యంతో పులకరించింది. మహాజాతరలో మూడో రోజైన శుక్రవారం సమ్మక్క, సారలమ్మతో పాటు పగిడిద్దరాజు,గోవింద రాజును లక్షలాది మంది భక్తులు దర్శించుకున్నారు. వనదేవతల నామ స్మరణ.. జయజయధ్వానాలతో మేడారం మార్మోగుతోంది. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు తనివితీరా మొక్కులు చెల్లించుకొని తన్మయత్వం పొందుతున్నారు. సామాన్యులే కాదు పలు రంగాల ..మిగతా 2లో



## కేసీఆర్ కు మళ్లీ నోటీసులు

మాజీ సీఎం మెడకు ఫోన్ ట్యాపింగ్ ఉచ్చు
నేడు మరోసారి నోటీసులు ఇవ్వనున్న సిట్
న్యాయనిపుణులతో దర్యాప్తు బృందం భేటీ
ప్రశ్నలు సిద్ధం చేసుకున్న అధికారులు




03

## మళ్లీ రెండేడ్లకు..

నేడు మేడారం జాతర ముగింపు
వనదేవతల వీడ్కోలు,
భక్తుల భావోద్వేగం!

02





## దానంపై విచారణ వాయిదా

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో
వాయిదా వేయాలన్న ఏలేటీ
వచ్చే నెల 18న నిర్వహిస్తామన్న
అసెంబ్లీ స్పీకర్

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసు విచారణ వాయిదా పడింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచి తర్వాత కాంగ్రెస్ లో చేరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై విచారణకు వచ్చే నెల 18న వాయిదా వేసినట్లు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వెల్లడించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల ..మిగతా 3లో



## మారింది పేర్లే..

ఏపీ జల దోపిడి ఆగలేదు
పథకం ప్రకారమే ఏపిలోని
పోలవరం - నల్లమలసాగర్ నీళ్లు
సుప్రీంకోర్టులో చెల్లని రిట్
పిటిషన్ దాఖలు
తెలంగాణకు తీరని అన్యాయం
మాజీ మంత్రి హరీశ్ రావు

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ నీటి హక్కులను మొత్తంగా ఆంధ్రప్రదేశ్‌కు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని మాజీ మంత్రి హరీష్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ నీటిని ఒడిసి పట్టుకుంటే.. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ఆ నీటిని ఏపీకి జారవిడుస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రాంతం వాడే తెలంగాణకు ద్రోహం ..మిగతా 3లో




## వారంలోగా అజెండాలు సిద్ధం చేయండి

ఏపీ, తెలంగాణకు కేంద్ర జల
వివాదాల పరిష్కార కమిటీ ఆదేశాలు
తెలుగు రాష్ట్రాల నదీ
జల వివాదాలపై కమిటీ భేటీ
50శాతం నీటి వినియోగానికి
అవకాశమివ్వాలని కోరిన తెలంగాణ
కమిటీ ముందుకు 12అంశాలు
చుక్క నీటిని వదులుకోమన్న
మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



03

## ప్రశంసలు మాత్రమే..

నిధులివ్వడంలో
కేంద్రం బ్యాక్
ఏపీ, తెలంగాణను
మెచ్చుకున్న ఆర్థిక సర్వే
ఫండ్స్ పై ముందే
చేతులెత్తేశారా?
కేంద్ర బడ్జెట్ పై
సన్నగిల్లుతున్న ఆశలు



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను ఎకనామిక్ సర్వేలో కేంద్రం మెచ్చుకుంది. అంతే.. రెండు తెలుగు రాష్ట్రాలకు ఇదే సంబురంగా మారింది. కానీ, ఇది నిజమైన ప్రశంసేనా అనే సందేహాలు కలుగుతున్నాయి. ఎందుకంటే.. కేంద్రం ఇచ్చే నిధుల విషయంలో ఈ రెండు రాష్ట్రాలకూ ఇప్పటివరకూ పెద్దగా ప్రయోజనాలేవీ కలిగించట్లేదు. దీంతో ఏపీ, తెలంగాణకు కేంద్రం బడ్జెట్‌లో షాక్ ఇవ్వబోతోందా?అనే అనుమానాలు కలుగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ పరిస్థితి ఆర్థికంగా ఏమాత్రం బాగోలేదు. ప్రత్యేక హోదా వస్తుంది అనుకుంటే.. అప్పట్లో సీఎంగా ఉన్న చంద్రబాబు ప్రత్యేక ప్యాకేజీకి ఓకే చెప్పడంతో ప్రత్యేక హోదా అటకెక్కింది. పోనీ ప్యాకేజీ అయినా వచ్చిందా అంటే అదీ లేదు. అటు తెలంగాణకి కూడా అన్యాయం జరుగుతోంది. తెలంగాణ నుంచి ..మిగతా 2లో





# సర్కారు స్కూళ్ల విద్యార్థులకు అల్పాహారం

- ఆర్థిక వనరులు సమకూరితే త్వరలోనే అమలు
- ఇప్పటికే సీఎం రేవంత్ సెగ్మెంట్లో ప్రారంభం
- కామన్ స్కూల్ ఉంటేనే ఉమ్మడి కుటుంబం గా సమాజం
- రంగారెడ్డి జిల్లా మొగిలిగిద్ద సభలో డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా అల్పాహారం ఏర్పాటు చేసే ఆలోచనతో ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టు గా తీసుకుని ఇప్పటికే ఈ పథకాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఆర్థిక వనరులు సమకూరితే రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం పథకం ప్రవేశపెడతామని తెలిపారు. ఎదిగే వయసులో పిల్లలకు సరైన ఆహారం లేక పరిపూర్ణంగా ఎదగలేకపోతున్నారనే ఆలోచనతో ప్రభుత్వం ఈ ఈ దిశగా ఆలోచన చేస్తుందని తెలిపారు. క్రవారం రంగారెడ్డి జిల్లా మొగిలిగిద్ద గ్రామంలో ఉన్నత పాఠశాల 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. కామన్ స్కూల్ విధానం ఉంటేనే సమాజం ఉమ్మడి కుటుంబం గా ఎదుగుతుందని అభిప్రాయపడ్డారు. చిన్ననాటి నుంచే అందరం కలిసిపోయామనే భావన కులం, మతం, ధనిక , పేద తేడా లేదన్న నిర్మాణాత్మక ఆలోచన సమాజంలో పెరుగుతుందనే ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మొట్టమొదటిసారి ఒక్కో పాఠశాలను 25 ఎకరాలు విస్తీర్ణంలో రూ. 200 కోట్ల బడ్జెట్ తో రాష్ట్రవ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో 20వేల కోట్లు వెచ్చిస్తూ ఒకేసారి నిర్మాణాలు ప్రారంభించామని వివరించారు. రాష్ట్రం ప్రపంచంతో పోటీ పడాలంటే గొప్ప మానవ వనరులు అవసరమని చెప్పారు. మానవ వనరులకు సానపడితేనే రాష్ట్రం ఆర్థికంగా బలపడుతుందన్నారు. అందుకు అందరికీ విద్య, వైద్యం ప్రజా ప్రభుత్వం ఉచితంగా అందాలన్నారు. అందుకే ఈ రెండు అంశాలపైనే దృష్టి సారించి ముందుకు పోతుందని అన్నారు. ఈ ఆలోచనలో భాగంగానే పాఠశాల నిర్వాహకులు పిలవగానే గతేడాది జనవరిలో సీఎం రేవంత్ రెడ్డి మొగిలిగిద్ద పాఠశాలకు వచ్చి రూ. పది కోట్లు కేటాయించారని వివరించారు. ఆ నిధులతో పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.

గత పాలకులు ఐటీఐలను అనాథలుగా వదిలేస్తే మారిన కాలానికి అనుగుణంగా వాటిలో శిక్షణ ఇవ్వాలన్నారు. ఆధునిక యంత్ర పరికరాలను తీసుకువచ్చి ప్రస్తుతం మార్కెట్లో ఉన్న పారిశ్రామికవేత్తలను తీసుకువచ్చి ఉపాధి పొందేందుకు అవసరమైన సిలబస్ను రూపొందించామన్న భట్టి.... రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోని ఐటిఐలను అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్నామని వివరించారు. హైదరాబాద్ రాష్ట్ర తొలి సీఎం బూర్గుల రామకృష్ణారావు తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు ఈ తరానికి తెలియవన్నారు. ఈ దేశంలో భూ సంస్కరణలకు ఆద్యుడు బూర్గుల రామకృష్ణారావు అని వివరించారు. బూర్గుల రామకృష్ణారావు, మర్రి చెన్నారెడ్డి తో పాటు ఉత్తరప్రదేశ్ మాజీ గవర్నర్ సత్యనారాయణ రెడ్డి, ప్రముఖ ప్రొఫెసర్ హరగోపాల్ వంటి అనేకమంది ప్రముఖులను మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల దేశానికి సమాజానికి అందించిందని తెలిపారు.

# ఫీజు రీయింబర్స్ మెంట్ జాప్యానికి వివరణ ఇవ్వండి

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సాకుతో ఇబ్బందులు పెట్టొద్దు
- ప్రైవేట్ కాలేజీల తీరుపై హైకోర్టు సీరియస్
- సమస్య పరిష్కారం కు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయండి

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సాకుతో విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేస్తున్న ప్రైవేటు కాలేజీల తీరుపై హైకోర్టుతీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫీజులు రాలేదన్న కారణంతో విద్యార్థులను వేధించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు.. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఫీజు చెల్లించని కారణంగా సర్టిఫికెట్లు ఇవ్వని కాలేజీలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హైకోర్టులో పలు విద్యార్థి సంఘాలు పిటీషన్ దాఖలు చేశాయి. శుక్రవారం వారి పిటిషన్లపై విచారణ చేపట్టిన కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అసలు సర్కారు నుంచి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఎన్ని..? వాటిని ఎప్పుడు చెల్లిస్తారు అనే అంశాలపై రెండు వారాల్లో పూర్తి వివరణ ఇవ్వాలని హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ధర్మాసనం ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఫీజు బకాయిల కోసం విద్యార్థుల సర్టిఫికెట్లను తాకట్టు పెట్టుకునే హక్కు ఏ విద్యా సంస్థకూ లేదని కోర్టు తేల్చి చెప్పారు. సర్టిఫికెట్లు ఇవ్వకపోతే విద్యార్థుల భవిష్యత్తు, ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటాయని కోర్టు వ్యాఖ్యానించింది. కాలేజీల వేధింపులకు గురవుతున్న విద్యార్థులు తమ ఫిర్యాదులను చెప్పుకునేందుకు, తక్షణ పరిష్కారం కోసం ఓ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తరపు న్యాయవాదికి సూచించారు.




# మొక్కుల మేడారం..!

**మొదటిపేజీ తరువాయి**



ప్రముఖులు పలు పార్టీల నేతలు వనదేవతల దర్శనాలకు తరలి వస్తున్నారు. ప్రజలకు ప్రజా ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రోటోకాల్స్ సిబ్బంది విశేష సేవలు అందిస్తున్నారు. గద్దెలపై కొలువుదీరిన అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు తండోప తండాలుగా తరలిరాగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు..వనదేవతలకు పసుపు, కుంకమలు, గాజులు, చీర సారెలను సమర్పిస్తున్నారు. బంగారాన్ని కానుకగా సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తులందరూ మేడారంలోని జంపన్నవాగు, చిలకలగుట్ట, నార్లపూర్ తదితర ప్రాంతాల్లోని చెట్ల కింద విడిది చేస్తున్నారు. బెల్లం మొక్కులే కాదు.. ఎదుర్కోళ్ళ ఆచారం కూడా ఉంది. అందుకే అమ్మవారికి కోడిని సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు భక్తులు. మేడారం పరిసరాల్లో ఎటు చూసినా ఆధ్యాత్మిక శోభ కనిపిస్తోంది. 8 కిలోమీటర్ల దూరం వరకు భక్తులు కనిపిస్తున్నారు. తెలంగాణలోని అన్ని ప్రాంతాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలు ఏపీ, ఛత్తీస్గడ్ మహారాష్ట్రాల నుంచి భక్తులు తరలి వస్తున్నారు.అనూహ్యంగా పెరిగిన భక్తులతో మేడారంలోని ప్రధాన దారులన్నీ వాహనాలతో కిక్కిరిసి పోయాయి. లక్షలాది మంది భక్తులు కోళ్లు, మేకలు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ జాతరలో కోయ ధరలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. జాతకాలు చెప్పడంతో పాటు తాయత్తులు కడుతున్నారు. గాలి ధూళి సోకకుండా మూలికలు ఇస్తున్నారు. శుక్రవారం దేశంలోని అనేకమంది మంత్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు వన దేవతల ఆశీస్సులు పొందారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మంత్రి 'సీతక్క కుటుంబ సమేతంగా అమ్మవార్ల దర్శనం చేసుకున్నారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సైతం అమ్మవారి దర్శనం చేసుకున్నారు. వీరితో పాటు ఎంపీ బలరాం నాయక్, పినపాక ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్, భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ ,పొలిటికల్ ఎకనామిక్ అడ్వైజర్ నళిని రఘురాం, రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా అమ్మ వార్లకు మొక్కలు చెల్లించారు. జాగృతి అధ్యక్షురాలు కవిత వనదేవతలను దర్శించుకున్నారు. అక్కడే మకాం వేసిన మంత్రి సీతక్క ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ.... భక్తులను పలకరిస్తున్నారు. మేళారం జాతరకు రద్దీ పెరగడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సెల్ ఫోన్ సిగ్నల్స్ లేకపోవడంతో కనెక్టివిటీకి ఇబ్బంది అవుతుందని వాపోతున్నారు. మరోవైపు డిజిటల్ లావాదీవీల పైన సిగ్నల్ ఎఫెక్ట్ పడింది. ఏటీఎంలో అందుబాటులో లేకపోవడం డిజిటల్ లావాదేవీలు జరగకపోవడంతో వ్యాపారులు భక్తులను నగదు కొరత వేధిస్తోంది. పకడ్బందీ నిఘా వ్యవస్థతో మహాజాతర కొనసాగుతోంది. లక్షలాదిగా తరలి వస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సిసీ కెమెరాలను అనుక్షణం పర్యవేక్షిస్తున్నారు పోలీస్ ఉన్నతాధికారులు. కాగా ఈ జాతరలో గ్రూప్ వన్ ట్రైనీ ఆఫీసర్లు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. భక్తుల రద్దీ నియంత్రణ గద్దల వద్ద పర్యవేక్షణ ట్రాఫిక్ విధుల్లో గ్రూప్ వన్ ట్రైనీ ఆఫీసర్లు భాగమయ్యారు. స్థానిక పోలీసులు ఆర్టిసి రెవెన్యూ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ మహాజాతర నిర్వహణ ఎలా జరుగుతుందో ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నారు. మరోవైపు వనజాతరలో ఆర్టీసీ కీలక పాత్ర పోషిస్తోంది. జాతరకు తరలి వెళ్లే భక్తుల కోసం 4వేల ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

**నేడు వనంలోకి దేవతలు..!**


మేడారం సమ్మక్క సారలమ్మ జాతర చివరి అంకానికి చేరుకున్నది. మూడు రోజుల పాటు కన్నులపండువగా జరిగిన ఈ జాతరలో కోటిన్నర మందికి పైగా భక్తులు వనదేవతలను దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. గత రెండు రోజుల పాటు భక్తులకు దర్శనం ఇచ్చిన సమ్మక్క సారలమ్మ ప్రత్యేక పూజల తర్వాత నేడు వన ప్రవేశం చేయనున్నారు. సమ్మక్కను చిలుకల గుట్టకు, సారలమ్మను కన్నెపల్లికి తరలించనున్నారు. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవతల వన ప్రవేశంతో జాతర నేటిలో ముగియనుంది.



# మళ్లీ రెండేడ్లకు..

- నేడు మేడారం జాతర ముగింపు
- వనదేవతల వీడ్కోలు, భక్తుల భావోద్వేగం!

**మేడారం, (ప్రజాస్వరం):**



ఈ ఏడాది మేడారం సమ్మక్క సారలమ్మ జాతర జనవరి 28 నుంచి 31 వరకూ... వనదేవతలు గద్దెలపైకి రావడంతో భక్తుల రద్దీ పెరిగింది. బారీగా బారులు తీరి అమ్మల్ను దర్శించుకుంటున్నారు. మూడోరోజు మొత్తం భక్తులు మొక్కులు చెల్లిస్తారు. ఇక నాలుగో రోజు వనదేవతలు తిరిగి అడవిలోకి వెళ్లడంతో జాతర ముగుస్తుంది. దీనిని వనప్రవేశం అంటారు. జనవరి 31 శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో వనప్రవేశం జరుగుతుంది. సమ్మక్క చిలకలగుట్టకు, సారలమ్మను కన్నేపల్లికి తిరిగి వెళతారు. పగిడిద్ద రాజు, గోవిందరాజు కూడా తమ స్థానాలకు తిరిగి వెళ్లిపోతారు. చివరి రోజు మొక్కులు చెల్లించి వనదేవతలకు వీడ్కోలు పలుకుతారు..దేవతల వనప్రవేశంతో గద్దెలు ఖాళీ అవుతాయి. జాతర పరిసమాప్తం అవుతుంది. ఈ ఘట్టం అత్యంత భావోద్వేగభరింతగా ఉంటుంది. మళ్లీ రెండేళ్ల వరకూ వేచి చూస్తారు భక్తులు

మేడారం జాతర రెండేళ్లకోసారి జరుగుతుంది కాబట్టి 2026 తర్వాత 2028లో జరుగుతుంది. ఏటా మాఘమాసంలో పౌర్ణమి ముందు వచ్చే నాలుగు రోజుల పాటూ జాతరజరుగుతుంది. ఎక్కువగా మేడారం జాతర ఫిబ్రవరి నెలలో ఉంటుంది. పూజారుల సంఘం ముందుగా తేదీలు నిర్ణయిస్తారు. ఈ ఏడాది తెలుగు నెలలు అధికమాసం వచ్చాయి కాబట్టి మళ్లీ జాతర ఎప్పుడు జరుగుతుంది? ఈ జాతర రెండు సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది కాబట్టి, 2026 తర్వాత 2028లో జరుగుతుంది. ఖచ్చితమైన తేదీలు ఇంకా అధికారికంగా ప్రకటించలేదు, కానీ సాధారణంగా మాఘ మాసంలో జనవరి లేదా ఫిబ్రవరిలో ఉంటుంది. పూజారుల సంఘం తేదీలు నిర్ణయిస్తుంది. మునుపటి జాతరలు ఎక్కువగా ఫిబ్రవరిలో జరిగేవి...ఈ ఏడాది పండుగలన్నీ ముందుగా రావడంతో మేడారం జాతర కూడా జనవరి ఆఖర్లోనే వచ్చేసింది. మళ్లీ 2026లో అధికమాసం ఉంది...జ్యేష్ఠం మాసం రెండు సార్లు వస్తుంది.. అధిక జ్యేష్ఠం, నిజ జ్యేష్ఠం... అంటే తెలుగు నెలలు 12 కాకుండా 13 ఉంటాయి..ఈ లెక్కన మేడారం జాతర 2028లో ఫిబ్రవి ఆఖర్లో వచ్చే అవకాశం ఉంది. మేడారం జాతరలో కోయ గిరిజన సంస్కృతి ప్రత్యేకంగా కనిపిస్తుంది. కోయ తెగవారు డప్పులు వాయిస్తూ నృత్యాలు చేస్తారు. భక్తులు పసుపు, ఎరుపు రంగు దుస్తులు ధరిస్తారు. మహిళలు ఒడిబియ్యం పోస్తారు. జాతరలో జంపన్నవాగు పవిత్రమైనది. ఇది గోదావరికి ఉపనది. మేడారం వచ్చే భక్తులంతా ఇక్కడ స్నానాలు చేసి వనదేవతలను దర్శించుకుంటారు. తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం జాతర కోసం ప్రభుత్వం జాతరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తుంది. భద్రతకోసం ముందస్తు ఏర్పాట్లు చేస్తుంది. ఆర్థికపరంగా కూడా జాతరకు ప్రాముఖ్యత ఉంది. స్థానికులకు ఉపాధి కల్పిస్తుంది. జాతరలో మొక్కులు చెల్లించడం ప్రధానం. కొందరు కాలినడకన వస్తారు. మరికొందరు మూడు రోజుల పాటూ అక్కడే గుడారాలు ఏర్పాటు చేసుకుని వంటా వార్పు చేసుకుంటారు.

మేడారం సమ్మక్క సారలమ్మ జాతర భారత దేశంలో అతిపెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధి చెందింది. తెలంగాణ రాష్ట్రం మలుగు జిల్లా మేడారం గ్రామంలో జరిగే ఈ జాతరను దక్షిణ భారత కుంభమేళా అని పలుస్తారు. ఈ పండుగ గిరిజనుల ఐక్యతకు, వారి సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెబుతుంది. 1996లో మేడారం జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించారు. ఇప్పుడు ఇది యునెస్కో హెరిటేజ్ గుర్తింపు కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ జాతరలో పాల్గొనడం ఓ అనుభూతి. భక్తుల ఉత్సాహం, దేవతల ఆశీస్సులు, సంస్కృతి సమ్మేళనం అద్భుతం.

# ప్రశంసలు మాత్రమే..

**మొదటిపేజీ తరువాయి**

భారీగా పన్నులను తీసుకుంటున్న కేంద్రం.. తిరిగి తెలంగాణకు ఆర్థిక సాయం చేసే విషయంలో, నిధులు ఇచ్చే విషయంలో దూరం పెడుతోంది. అఫ్‌కోర్స్ ఇందులో రాజకీయ కారణాలు కూడా ఉన్నాయి. ఈ రెండు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో లేదు. ఏపీలో కూటమిలో భాగస్వామిగా ఉన్నా.. అంతంతమాత్రమే. తాము అధికారంలో ఉన్న రాష్ట్రాలు అభివృద్ధి చెందేలా బీజేపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలో ఆర్థిక సర్వేలో ఏపీ, తెలంగాణను మెచ్చుకోవడం, అంతా బాగుందని చెప్పడం ద్వారా.. "మీకు కేంద్రం సాయం చెయ్యాల్సిన అవసరం లేదు" అనే సంకేతాలను ఇస్తున్నట్లు కనిపిస్తోంది.ఆర్థిక సర్వేలో ఏపీ, తెలంగాణ పరిస్థితి బాలేదు అని చెప్పి ఉంటే.. వెంటనే ఈ రెండు రాష్ట్రాల ప్రభుత్వాలూ.. బడ్జెట్ లో తమకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని కోరతాయి. అందువల్ల కేంద్రం తెలివిగా.. ఈ రెండు రాష్ట్రాల పరిస్థితులూ బాగున్నాయి అని చెప్పడం ద్వారా.. బడ్జెట్ కంటే ముందే.. చేతులు దులుపుకుంటున్నట్లు కనిపిస్తోంది.

**మీరే బెటర్**

లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేని గనిస్తే.. 202627 ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధి రేటు 6.8 నుంచి 7.2 శాతం మధ్య ఉంటుందని కేంద్రం అంచనా వేసింది. ఈ సర్వేలో తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చింది. రెండు రాష్ట్రాల్లో ద్రవ్యోల్బణం జాతీయ సగటు కంటే 1.72 శాతం తక్కువగా నమోదైందని తెలిపింది. తెలంగాణలో ద్రవ్యోల్బణం 8.61 శాతం నుంచి 0.20శాతానికి తగ్గగా.. ఆంధ్రప్రదేశ్‌లో 7.57శాతం నుంచి 1.39శాతానికి తగ్గిందని తెలిపింది. తెలంగాణలో సాగుకి అనుకూలమైన భూమి విస్తీర్ణం 201423 మధ్య 1.31 కోట్ల ఎకరాలుగా ఉండగా.. ఇప్పుడు 2.21 కోట్ల ఎకరాలకు పెరిగిందని సర్వే తెలిపింది. ఇందుకు మిషన్ కాకతీయ ద్వారా చెరువుల్ని పునరుద్ధరించడం, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగు నీరు కల్పించడం కారణమని కేంద్రం మెచ్చుకుంది. ఈ కారణంగా తెలంగాణ.. దేశంలోనే న్యూ బౌల్ ఆఫ్ ఇండియా (కొత్త ధాన్యపు గిన్నె)గా మారిందని రిపోర్ట్ తెలిపింది. 202526లో అకాల వర్షాలు, ప్రకృతి విపత్తుల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ధాన్య దిగుబడి తక్కువగా నమోదైందని సర్వే తెలిపింది.


**ఏపీలో కొత్త నగరాలకు ప్రశంస:**

దేశంలో వస్తున్న కొత్త నగరాల జాబితాలో అంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని కేంద్రం చేర్చింది. దీన్ని గ్రీన్ సిటీగా నిర్మిస్తుండటాన్ని మెచ్చుకుంది. ఏపీ ప్రభుత్వం వ్యాపార సంస్కరణల్లో టాప్‌లో ఉందనీ, సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు త్వరగా ఇస్తోందని చెప్పింది. 6,900 గ్రామాల్లో 81 లక్షల భూకమతాలకు రీసర్వే చెయ్యడం, 86 వేల సరిహద్దు వివాదాల్ని పరిష్కారించడం, ప్రపంచ స్థాయి బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు వంటి అంశాల్ని ఆర్థిక సర్వే గొప్పగా చెప్పింది. ఈ సర్వే ప్రకారం.. హైదరాబాద్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో 4వ స్థానంలో నిలిచింది. 2035 నాటికి హైదరాబాద్ జీడీపీ 201.4 బిలియన్ డాలర్లకు చేరుకోవచ్చనీ, మున్సిపల్ బాండ్ల జారీలో దేశంలో నంబర్ వన్‌గా ఉందని ఆర్థిక సర్వే తెలిపింది. హైదరాబాద్‌వరంగల్ మధ్య రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని సర్వే సూచించింది. ఐటీ, ఫైనాన్స్ సేవల్లో తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు కలిసి 40 శాతం వాటా కలిగి ఉండగా, ఏఐ స్టార్టప్‌లలో తెలంగాణ 7 శాతం వాటా కలిగి ఉందని రిపోర్ట్ తెలిపింది.

**బడ్జెట్ లో ఏమైనా ఉంటుందా..?**

మొత్తంగా అంతా బాగుంది అని రిపోర్టులో చెప్పారు కాబట్టి.. బడ్జెట్ లో తెలుగు రాష్ట్రాలకు ప్రాధాన్యం ఉంటుందా అనే సందేహా కలుగుతోంది. మరోవైపు ఈ రిపోర్టులో కాళేశ్వరం, మిషన్ కాకతీయలను కేంద్రం మెచ్చుకోవడం ద్వారా.. బీఆర్ఎస్‌కి ప్లస్ అయ్యింది. ఇటీవల బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రహస్య పొత్తు ఉందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ ఆరోపణలకు బలం ఇస్తున్నట్లుగా ఆర్థిక సర్వే ఉంది అని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. మరోవైపు తమ హయాంలో ఉన్న ప్రాజెక్టులు ఎంత గొప్పవో ఆర్థిక సర్వే బయటపెట్టిందని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. ఇలా ఈ రిపోర్ట్.. చర్చగా మారింది.





# కేసీఆర్ కు మళ్లీ నోటీసులు

- **మాజీ సీఎం మెడకు ఫోన్ ట్యాపింగ్ ఉచ్చు**
- **నేడు మరోసారి నోటీసులు ఇవ్వనున్న సిట్**
- **న్యాయనిపుణులతో దర్యాప్తు బృందం భేటీ**
- **ప్రశ్నలు సిద్ధం చేసుకున్న అధికారులు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తోన్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం.. మాజీ సీఎం కేసీఆర్ మెడకు చుట్టుకున్నట్లు తెలుస్తున్నది. ఇప్పటికే ఈ వ్యవహారంలో పలువురు పోలీసు మాజీ ఉన్నతాధికారులు, మంత్రులు, నాయకులను విచారించిన సిట్ అధికారులు.. తుది దశలో కేసీఆర్ ను విచారించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఈ నెల 29న హైదరాబాద్ లోని నందినగర్ లో ఎన్న కేసీఆర్ ఇంటికి వెళ్లిన అధికారులు.. ఈ నెల 30న విచారణకు సిద్ధంగా ఉండాలని కోరారు. కానీ అదే రోజు రాత్రి విచారణను వాయిదా వేయాలని కేసీఆర్.. సిట్ అధికారులకు లేఖ రాశారు. మున్సిపల్ ఎన్నికలు, నామినేషన్ల పర్వం కొనసాగున్న వేళ నేడు విచారణకు హాజరు కాలేనని లేఖలో పేర్కొన్నారు. తనకు కాస్త సమయం కావాలని కోరారు. ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌజ్‌లోనే విచారణ చేసుకోవచ్చని తెలిపారు. బాధ్యత గల పౌరుడిగా విచారణకు సహకరిస్తానని అన్నారు. దీంతో కేసీఆర్ కు సిట్ అధికారులు మినహాయింపు ఇస్తారనే ప్రచారం జరిగింది. కానీ అనూహ్యంగా సిట్ అధికారులు శుక్రవారం సాయంత్రం న్యాయ నిపుణులతో భేటీ అయ్యారు. ఇందులో కీలక అంశాలపై చర్చలు జరిపారు. మరోవైపు కేసీఆర్‌ను ఎక్కడ విచారణ జరపాలనే అంశంపై ఇప్పటికే ఒక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. న్యాయ సలహాల తర్వాత కొత్త తేదీతో నేడు రెండోసారి నోటీసులు ఇవ్వడానికి నిర్ణయించినట్లు సమాచారం.

**'సిట్' ప్రశ్నాస్త్రం**

కేసీఆర్ ను విచారించేందుకు సిద్ధమవుతోన్న సిట్... ఆయన్ను అడగాల్సిన ప్రశ్నలు సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారి ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును రిటైర్ అయిన తర్వాత మళ్లీ అదే స్థానంలో ఓఎస్డీగా ఎలా నియమించారు? రిటైరైన అధికారికి ఇంటెలిజెన్స్ విభాగం బాధ్యతలు ఎందుకు అప్పగించారు? రాధాకిషన్‌రావు రిటైరైన తర్వాత కూడా ఏళ్ల తరబడి కొనసాగడానికి కారణాలేమిటి? ఇవి పోలీసు ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయాలా? లేక మీరు చెబితేనే వారు ఆదేశాలిచ్చారా?' తదితర ప్రశ్నలు కేసీఆర్‌కు సంధించేందుకు సిద్ధమయ్యారు. కేసీఆర్ విచారణ తర్వాత తుది ఛార్జ్‌షీట్ దాఖలు చేయనున్నారు. దీనికి ముందే మరోసారి కేటీఆర్, హరీశ్, సంతోష్‌ను సిట్ విచారించొచ్చని తెలుస్తోంది.

# దానంపై విచారణ వాయిదా

**మొదటిపేజీ తరువాయి**



అనర్హత కేసులో సుప్రీంకోర్టు విధించిన గడువు నేటితో ముగియనుండటంతో స్పీకర్ విచారణను వేగవంతం చేశారు. ఈ క్రమంలో గతంలో ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొన్న మెజారిటీ ఎమ్మెల్యేల పిటిషన్లను కొట్టేసిన స్పీకర్.... శుక్రవారం దానం నాగేందర్ ను విచారించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆయనకు నోటీసులు ఇచ్చారు. దీంతో దానం నాగేందర్ తన లీగల్ టీంతో అసెంబ్లీకి చేరుకోగా, పాడి కౌశిక్ రెడ్డి సైతం తన తరపు న్యాయవాదులతో అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో మున్సిపల్ ఎన్నికలు ఉన్నందున విచారణ వాయిదా వేయాలని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి స్పీకర్ ను కోరారు. దీంతో విచారణను వచ్చే నెల 18న వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. కాగా ఈ వ్యవహారంలో ముందు నుంచే తన వాణి వినిపిస్తున్న దానం... ఇప్పటికీ తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనేనని చెప్పారు. ఇప్పటి వరకు తాను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదని, ఇప్పటికీ ఆ పార్టీలోనే కొనసాగుతున్నానని పేర్కొన్నారు. 2024 మార్చిలో తాను కాంగ్రెస్ సమావేశానికి హాజరైంది కేవలం వ్యక్తిగత హోదాలోనే తప్ప పార్టీ మారినట్లుగా కాదని తెలిపారు. ఈ క్రమంలో విచారణకు ముందే దానం స్పీకర్‌కు ఓ అఫిడవిట్ సమర్పించారు. చివరకు ఫిరాయింపు కేసు విషయంలో స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోననే చర్చ జరుగుతున్నది.

# అమరచింతలో ఎన్నికల భద్రతపై సీఐ సమీక్ష

- **నామినేషన్లు ముగిసిన వేళ అమరచింతలో పోలీసు బందోబస్తు పరిశీలన**

**అమరచింత,జనవరి 30 (ప్రజాస్వరం):**

మున్సిపల్ ఎన్నికల నామినేషన్లు ముగిసిన నేపథ్యంలో అమరచింత మున్సిపల్ నామినేషన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును ఆత్మకూర్ సీఐ శివకుమార్ పరిశీలించారు. ఎస్ఐ స్వాతి పాల్గొన్నారు. 10 వార్డులకు ఎన్నికలు జరగనున్నందున నామినేషన్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ పేర్కొన్నారు. 100 మీటర్ల పరిధి నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, అనుమతి లేకుండా ఎవరినీ లోపలికి అనుమతించకూడదని పోలీసులకు సూచించారు. సమస్యాత్మక కేంద్రాన్ని కూడా పరిశీలించారు. విధుల్లో సమయస్ఫూర్తి చూపిన పోలీసు సిబ్బందికి స్థానిక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.




# డైవర్షన్ పాలిట్రిక్స్

**మొదటిపేజీ తరువాయి**

చేయడం వెనుక ప్రభుత్వ ఉద్దేశ్యం కేవలం చర్చను మళ్లించడమేనని బీఆర్ఎస్ గట్టిగా నమ్ముతోంది. అయితే, ఇక్కడే ఒక విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ఇది డైవర్షన్ అని ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు కూడా, చివరకు అదే అంశంపై చర్చించేలా కాంగ్రెస్ తన వ్యూహాన్ని అమలు చేయడంలో సఫలమైంది. సిట్ నోటీసులు, విచారణలు, అరెస్టుల చుట్టూనే రాజకీయం తిరుగుతుండటంతో.. బీఆర్ఎస్ యంత్రాంగం మొత్తం ఇప్పుడు ఆ కేసును ఎదుర్కోవడంలోనే నిమగ్నమైపోయింది.

**బీఆర్ఎస్ మౌనం - కాంగ్రెస్ దూకుడు**

ఫిబ్రవరి 11న రాష్ట్రవ్యాప్తంగా 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఎన్నికలు జరగనున్నాయి. వాస్తవానికి ఈ సమయానికి బీఆర్ఎస్ తన శ్రేణులను క్షేత్రస్థాయిలో సమాయత్తం చేయాలి. కానీ, పార్టీ అధినేత కేసీఆర్ నుండి ద్వితీయ శ్రేణి నేతల వరకు అందరి దృష్టి ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ కేసుపైనే ఉంది. మరోవైపు, కాంగ్రెస్ మాత్రం చాలా నిశ్శబ్దంగా, పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఇన్‌చార్జుల నియామకం, క్షేత్రస్థాయి సర్వేలు పూర్తి చేసిన రేవంత్ రెడ్డి సర్కార్, బీఆర్ఎస్‌ను ఈ కేసులో బిజీగా ఉంచి, తాము గ్రౌండ్ లెవల్‌లో క్లీన్ స్వీప్ చేయాలనే ప్లాన్‌తో ఉన్నట్లు కనిపిస్తోంది.

**ట్యాపింగ్ వేడిలో అదృశ్యమైన ప్రజా సమస్యలు**

ఎన్నికల సమయంలో చర్చకు రావాల్సిన స్థానిక సమస్యలు, అభివృద్ధి పనులు ఇప్పుడు ఎక్కడా వినిపించడం లేదు. కాంగ్రెస్ విసిరిన ట్యాపింగ్ అస్త్రం బీఆర్ఎస్ చేతిలో ఉన్న ఇతర ఆయుధాలను నిర్వీర్యం చేసింది. సింగరేణి బొగ్గు కుంభకోణం లేదా ప్రభుత్వ వైఫల్యాల గురించి బీఆర్ఎస్ మాట్లాడదామనుకునే లోపే, సిట్ నోటీసులు వచ్చి చర్చా వేదికను మార్చేస్తున్నాయి. ఫలితంగా, బీఆర్ఎస్ డిఫెన్సివ్ మోడ్‌లోకి వెళ్లక తప్పడం లేదు. ఇది పరోక్షంగా కాంగ్రెస్‌కు ఎన్నికల ప్రచారంలో ఒక అడ్వాంటేజ్‌గా మారుతోంది.

**సవాల్‌గా మారిన ప్రస్తుత రాజకీయం**

కేసీఆర్‌కు నోటీసులు అందడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఒక రకమైన ఆందోళన మొదలైంది. ఎన్నికలకు కేవలం రెండు వారాల ముందు పార్టీ అధినేత విచారణను ఎదుర్కోవాల్సి రావడం క్యాడర్ నైతిక బలాన్ని దెబ్బతీసే అవకాశం ఉంది. రాజకీయంగా దీనిని వేధింపులు అని ప్రచారం చేసినా, విచారణ ఎదుర్కోవడం అనేది అనివార్యంగా మారింది. ఈ పరిస్థితుల్లో బీఆర్ఎస్ అగ్ర నాయకత్వం కేవలం ఫోన్ ట్యాపింగ్ కేసుకే పరిమితం కాకుండా, ఎన్నికల వ్యూహాలను ఎలా సమన్వయం చేసుకుంటుందనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న.




**విజయం ఎవరిని వరిస్తుంది?**

రాజకీయంగా చూస్తే, కాంగ్రెస్ ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లుగా వ్యవహరిస్తోంది. అటు పాత కేసుల ద్వారా బీఆర్ఎస్ ప్రతిష్టను దెబ్బతీయడం, ఇటు ఎన్నికల వేళ ప్రతిపక్షాన్ని ఆత్మరక్షణలో పడేయడం ద్వారా మున్సిపల్ పోరులో పైచేయి సాధించాలని చూస్తోంది. బీఆర్ఎస్ గనుక ఈ ట్రాప్ నుండి త్వరగా బయటపడి, ఎన్నికల ఎజెండాను మార్చలేకపోతే, మున్సిపల్ ఫలితాలు ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ అయ్యే ప్రమాదం ఉంది. డైవర్షన్ అని తెలిసినా, ఆ ఉచ్చులో పడకుండా తప్పించుకోవడం ఇప్పుడు బీఆర్ఎస్ ముందున్న అసలైన సవాల్.

# మారింది పేర్లే..

**మొదటిపేజీ తరువాయి**

చేస్తున్నాడని కాళోజీ ముందే ఊహించి చెప్పినట్లే.. సీఎం హోదాలో రేవంత్ రెడ్డి రాష్ట్ర నీటిని ఆంధ్రాకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. పక్కా పథకం ప్రకారమే పోలవరం నల్లమలసాగర్ కు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తోందన్న హరీశ్ రావు ఇందులో భాగంగానే సుప్రీంకోర్టులో చెల్లని రిట్ పిటిషన్ వేసి వాపస్ తెచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. ఒక వేళ ఆ తప్పు జరిగితే తెలంగాణ నీటి చరిత్రలో నేడు ఒక బ్లాక్ డే గా మిగిలిపోతుందని వ్యాఖ్యానించారు. శుక్రవారం తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. బనకచర్ల, నల్లమల సాగర్ అయినా మారింది పేరు మాత్రమే కానీ ఏపీ జల దోపిడి ఆగలేదన్నారు. జల ద్రోహం విషయంలో కత్తి చంద్రబాబుది అయితే పొడిచేది రేవంత్ రెడ్డి అని విమర్శించారు. సమైక్య పాలనలో తెలంగాణకు నీటి వాటాల్లో తీరని అన్యాయం చేసిన కాంగ్రెస్.. నేడు మరో చారిత్రక ద్రోహం చేస్తున్నదన్నారు. చంద్రబాబుతో దోస్తీ కట్టి, తెలంగాణకు తీరని అన్యాయం చేసేందుకు సిద్ధమైన రేవంత్ రెడ్డిని తెలంగాణ సమాజం క్షమించదన్నారు. ప్రజాక్షేత్రంలో దుర్మార్గాన్ని ఎండగట్టి.. రాష్ట్ర నీటి హక్కుల కోసం మరో పోరాటం చేస్తామని ప్రకటించారు. శుక్రవారం ఢిల్లీలో జరుగుతున్న నీటి పారుదల శాఖ సమావేశం సాక్షిగా రేవంత్ ప్రభుత్వం రాష్ట్రానికి మరణ శాసనం రాయబోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం నల్లమల సాగర్ విషయంలో రేవంత్ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం ఏపీకి సహకరిస్తోందని ఆ కుట్రల తీరు గమనిస్తే అందరికీ అర్థమవుతుందని తెలిపారు. పోను పోను అనుకుంటూనే రేవంత్ రెడ్డి ఆనాడు ఢిల్లీ మీటింగ్ కు వెళ్లడమే కాకుండా.. తమ ఎజెండాలో లేదంటూనే బనకచర్లపై చర్చ జరిపి.. పెట్టనంటూనే దానిపై సంతకం పెట్టి తెలంగాణ నదీజలాల హక్కుల్ని కాలరాశాని ఆరోపించారు. కమిటి వేసి ఏపీ జల దోపిడీకి రెడ్ కార్పెట్ వేశారన్నారు. టెండర్ చివరి తేదీ అయిపోయాక సుప్రీం కోర్టు కు వెళ్లి నల్లమల సాగర్ ప్రాజెక్టుకు పరోక్షంగా అంగీకారం తెలిపారని విమర్శించారు. పస లేని రిట్ వేసి పరిపూర్ణంగా నల్లమల సాగర్ కు మద్దతు ప్రకటిస్తే.. దానిని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వాపస్ తెచ్చుకున్నాడన్నారు.

**కేంద్రం ఏ హామీ ఇచ్చింది...?**

సీఎం రేవంత్ రెడ్డి.. నల్లమలసాగర్ పై పథకం ప్రకారం చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లిస్తున్నారని హరీశ్ రావు అన్నారు. ఏపీ ఒత్తిడితో శుక్రవారం పేరుకు జలవివాదాల మీటింగ్ జరుగుతున్నా.. మన 200 టీఎంసీలను గంపగుత్తగా తరలించుకుపోయే నల్లమలసాగర్ అనే ప్రాజెక్టు సంబంధించిన కుట్రే జరుగుతోందన్నారు. గతంలో కేంద్ర జల్ శక్తిశాఖ నిర్వహించిన సమావేశంలోనూ ఏపీ ఈ ప్రాజెక్టుపైనే ఏకైక ఎజెండా ముందు పెట్టిందన్నారు. ఇప్పుడు కూడా ఏపీ నల్లమలసాగర్ లింకు ప్రాజెక్టునే తెరమీదకు తెచ్చి చర్చ చేస్తున్నారన్నారు. దీనిపై గతేడాది డిసెంబర్ 30న తాను లేఖ రాస్తే.. కాంగ్రెస్ సర్కార్ మర్నాడు మరో లేఖ రాసిందన్నారు. అందులో మొదటి కండీషన్.. నల్లమల సాగర్ కు డిపిఆర్ వెంటనే ఆపాలి, కేంద్రం అనుమతుల ప్రక్రియను తక్షణం ఆపాలి అని.. రెండోది.. ప్రీ ఫీజబులిటి రిపోర్టు ఆపినట్లు ఏపీ హామి ఇవ్వాలని రాశారు. ఈ రెండు కండీషన్లకు ఒప్పుకుంటేనే ఢిల్లీ మీటింగ్ కు వస్తామన్నారు. ఈ రెండు కండీషన్లకు కేంద్రం హామి ఇచ్చిందా? ఏపీ హామి ఇచ్చిందా? అని హరీష్ రావు ప్రశ్నించారు. మంత్రి ఉత్తమ్ అప్రూవల్ తోనే లెటర్ వెళ్లినపుడు ఎలాంటి హామీ లేకుండా మీటింగ్ కు ఎందుకు వెళ్లారని మీడియా ముఖంగా నిలదీశారు. దీనిపై కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి నోరు విప్పాలన్నారు.

# గాంధీ వర్ధంతి కార్యక్రమం

**మక్తల్,జనవరి 30(ప్రజాస్వరం):**

మక్తల్ పట్టణం రాయచుర్ రోడ్ లో గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం దగ్గర ఆర్యవైశ్య అనుబంధ సంఘాలు, వాసవి వనిత క్లబ్ వారు గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన యోగా గురూజీ ప్రకాష్ జి మాట్లాడుతూ.. అందరూ గాంధీజీ అడుగుజాడల్లో నడవాలని,నిజ జీవితంలో పుట్టినరోజు వేడుకలు కుటుంబ సభ్యుల సమక్షంలో చేసుకుంటామని, కానీ ఇలాంటి మహనీయుల వర్ధంతిని మాత్రం ప్రజలందరూ జరుపుకుంటారని,మహాత్మ గాంధీ పాటించిన సత్యం, అహింస మార్గంలో ప్రజలు మార్గదర్శకంగా తీసుకోవాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య అనుబంధ సంఘాలు, వాసవి దేవాలయ కమిటీ చైర్మన్ కొత్త శ్రీనివాస్ గుప్తా,యోగ గురువు ప్రకాష్ జీ ,వాసవి,వనిత క్లబ్స్, యువకులు, తదితరులు పాల్గొన్నారు.





# వారంలోగా అజెండాలు సిద్ధం చేయండి

- **వారంలోగా అజెండాలు సిద్ధం చేయండి**
- **ఏపీ, తెలంగాణకు కేంద్ర జల వివాదాల పరిష్కార కమిటీ ఆదేశాలు**
- **తెలుగు రాష్ట్రాల నదీ జల వివాదాలపై కమిటీ భేటీ**
- **50శాతం నీటి వినియోగానికి అవకాశమివ్వాలని కోరిన తెలంగాణ**
- **కమిటీ ముందుకు 12అంశాలు**
- **చుక్క నీటిని వదులుకోమన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జల వివాదాలపై ఏర్పాటైన కేంద్ర జల వివాదాల పరిష్కార కమిటీ సమావేశం శుక్రవారం ప్రశాంతంగానే ముగిసింది. న్యూఢిల్లీలోని కేంద్ర జలసంఘం (సీడ్లూసీ) కార్యాలయంలో జలసంఘం ఛైర్మన్ అధ్యక్షతన దాదాపు రెండు గంటల పాటు కొనసాగిన ఈ సమావేశానికి సీడబ్ల్యూసీ అధికారులు, కృష్ణా నది యాజమాన్య మండలి (కేఆర్ఎంబీ), గోదావరి నది యాజమాన్య మండలి (జీఆర్ఎంబీ), నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్ డబ్ల్యూడీఏ) ఛైర్మన్లు, కేంద్ర జలసంఘం చీఫ్ ఇంజినీర్, తెలుగు రాష్ట్రాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. సమావేశం అనంతరం తెలంగాణ ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్ బొజ్జ అక్కడి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ తరపున 12 అంశాలను చర్చకు ప్రతిపాదించినట్లు తెలిపారు. పోలవరం, నల్లమల్ల సాగర్ ప్రాజెక్టులను అజెండాలో చేర్చవద్దని స్పష్టం చేసినట్లు వెల్లడించారు. రెండు రాష్ట్రాల మధ్య కృష్ణా, గోదావరి నదీ జలాలకు సంబంధించి అనేక సమస్యలు, వివాదాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అయితే ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ తన అజెండాను వెల్లడించలేదని రాహుల్ బొజ్జ తెలిపారు. తదుపరి సమావేశం నిర్వహణపై సీడబ్ల్యూసీ నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు. అజెండాలో 12 అంశాలు చేర్చాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. పోలవరం, నల్లమలసాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టవద్దని కోరింది. ట్రైబ్యునల్ తీర్పు వచ్చే వరకు 50 శాతం వాడుకునే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశామన్నారు. అదే సమయంలో తెలంగాణ అధికారులు లేవనెత్తిన పలు అంశాలపై ఏపీ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇరు రాష్ట్రాల అధికారుల వాదనలు విన్న సీడబ్ల్యూసీ ఛైర్మన్ వారంలోగా అజెండా అంశాలు ఖరారు చేసి లిఖితపూర్వకంగా ఇవ్వాలని ఆదేశించారు. రెండు రాష్ట్రాల అజెండా అంశాలు ఖరారయ్యాక మరోసారి భేటీ తేదీని ఖరారు చేస్తామని స్పష్టం చేశారు.

**చుక్క నీటిని వదులుకోం : ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్**



కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన నీటి వాటాలో ఒక్క చుక్క నీరు కూడా వదులుకునే ప్రసక్తే లేదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీలో జరిగిన భేటీ.. అందులో చర్చకు వచ్చిన అంశాల గురించి తెలుసుకుని మాట్లాడాలని బీఆర్ఎస్ నేత హరీష్ రావుకు సూచించారు. శుక్రవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. మన నది జలాలను కాపాడుకోవడానికి ఎవరితోనైనా చర్చలకు సిద్ధమని చెప్పారు. తెలంగాణ అధికారులు.. నల్లమల సాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టడానికి ఒప్పుకోమని స్పష్టం చేశారన్నారు. ఇంటర్ స్టేట్ ఇష్యూలు అజెండాలో పెట్టాలని కేంద్రానికి చెప్పారు. పోలవరం.. నల్లమల సాగర్ కి అనుమతి లేదని కేంద్ర మంత్రి రెండు రోజుల క్రితమే తనకు లేఖ రాశారని చెప్పారు. శుక్రావరం జరిగిన భేటీలోనూ సీడబ్ల్యూసీ ఇదే చెప్పిందన్నారు.. పదేళ్లు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందన్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో నీటి వాటా సాధన కోసం పోరాడుతోన్న కాంగ్రెస్ నేతలను విమర్శిస్తోన్న బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా సిగ్గుపడాలన్నారు. పదేళ్లలో ఎస్ఎల్బీసీ, డిండి ప్రాజెక్టులను పూర్తి చేయలేదని మండిపడ్డారు. పదే పదే అబద్ధాలు చెప్పి వాటిని నిజం అని నమ్మించే ప్రయత్నం చేస్తే ఒప్పుకోవడానికి ప్రజలు సిద్ధంగా లేరన్నారు.

# నేదునూరి మాట ఓటరా మేలుకో పురపాలనను ఏలుకో

కరీంనగర్/ హైదరాబాద్( ప్రజాస్వరం)

(తెలంగాణలో పురపాలక ఎన్నికల
నగారా మోగిన సందర్భంగా పట్టణ
ఓటర్ల చైతన్యం కొరకు రాసిన
కవిత)
నగరాభివృద్ధిలో పురపాలక
పాలన కీలక పాత్ర పోషిస్తుంది
రాష్ట్రంలో పురపాలక ఎన్నికలకు
నగారా మోగింది
ఓటరా మేలుకో
పురపాలనను ఏలుకో
నగర ఓటర్లలో చైతన్యం
పెరగాలి
నగరాభివృద్ధికి నీ ఓటు
ప్రశ్నించే గళం కావాలి
ఓటు నీతలరాతను
మార్చాలి
నగరవీధుల్లో వెలుగులు చూడు
డ్రైనేజ్ రోడ్డు గుంతలు చూడు
నీ ముంగిట ఉన్న సమస్యలు
తీర్చేసత్తాఉన్న అభ్యర్థిని చూసి
ఓటేయి
ఏపార్టీవాడో చూడొద్దు
అభ్యర్థి ఏ పాటివాడో చూడాలి
నిజాయితీ నేరరాహిత్యం
సేవాభావం ఉన్నవారిని
కౌన్సిలర్గా కార్పొరేటర్గా
ఎన్నుకోవాలి
పట్టణంలో మౌలిక సదుపాయాలు
కల్పన ఉపాధినైపుణ్యాభివృద్ధి
డిజిటల్ ఆధునిక సేవలు విద్య
ఆరోగ్యంమురికి కాల్వల గోస
మంచినీటి కష్టాలుతీర్చి పచ్చదనం
పారిశుధ్యం స్వచ్ఛతకు ప్రకృతి
పర్యావరణ రక్షణకు
అంతర్గత రోడ్లు డ్రైనేజీలు
పబ్లిక్ పార్కు ఆరోగ్య సంరక్షణ
వర్షపు నీరు ఇంకుడు
గుంతల ఏర్పాటు
డివిజన్ /వార్డ్ అభివృద్ధికి బడ్జెట్
తీసుకొచ్చే సత్తా ఉన్న అభ్యర్థికి
ఓటెయి అభివృద్ధికి బాటెయ్యి
పోటీ చేసిన అభ్యర్థి గుణాన్ని
చూసి ఓటెయి
ఐదేళ్లకోసారి వచ్చే పండుగ
నీచేతివేలుపై గీసే చైతన్య గీత
డబ్బుకు మద్యానికి బీరు
బిర్యానికి హామీల ప్యాకేజీకి
నోటుకు ఓటు వేయకు
నీ ఆత్మగౌరవాన్ని అమ్ముకోకు
అభివృద్ధిని అడ్డుకోకు
నీఓటు నగరాన్ని తీర్చిద్దే
వజ్రాయుధం కావాలి
అభివృద్ధిని చూసి ఓటెయి
నిజాయితీగలనేతకే పట్టం కట్టు
పురపాలక ఎన్నికలే పట్టణ
ప్రగతికి మూలం
ఓటు మీకు ఒక వరం దాన్ని
వదులుకోవద్దు
ఓటుమీదైన స్వరం మౌనంగా
ఉండొద్దు
మీపట్టణం మీభవిష్యత్తు కోసం
ఓటు వినియోగించాలి

ప్రజల అవసరాలు ఆకాంక్షలు
సమస్యలు ప్రభుత్వ విధానాల్లో
ప్రతిబింబించాలంటే ఓటు హక్కు
ఉన్నవారు తప్పని సరిగా
ఓటేయ్యాలి
నా ఒక్క ఓటుతో ఏమీ మారదు
అనే నిర్లక్ష్యం ప్రజాస్వామ్యాన్ని
బలహీనపరుస్తుంది
ఒక్క ఓటే ప్రభుత్వాలను
తలకిందులు చేసిన సంఘటన
మరవద్దు ఒక్క ఓటుతోనే అటల్
బిహారీ వాజపేయి ప్రభుత్వం
పడిపోయిన సంఘటన ఓటర్లకు
కనువిప్పు కావాలి
కులం మతం డబ్బుకు
లొంగకు బాధ్యతగల
పౌరుడుగా ఓటేయి
ప్రజాస్వామ్య పండుగలో
భాగస్వామివై చైతన్యంతో
ప్రగతి శీలురను ఎన్నికో
ఏసీ గదుల్లో కూర్చొని కాల
యాపన చేయడం మానండి
పోలింగ్ కేంద్రం వైపు అడుగులు
వేసి మార్పుకు పునాదులు
వేయండి సినిమా షికార్లు వద్దు
ఓటు వేయడమే హద్దు కావాలి
ప్రయాణాలు తీర్థయాత్రలు
మానండి ఉత్తమ అభ్యర్థులను
కాన్సిలర్/ కార్పొరేటర్ గా
ఎన్నుకొని కాలనీ స్థితిగతులు
మార్చండి అభివృద్ధికి
దిక్సూచిగా నిలవండి
పోలింగు రోజు సెలవు రోజని
విశ్రాంతి తీసుకోవద్దు
విద్యావంతులు ఉద్యోగులు
మధ్య తరగతి ఓటర్లు
సంపన్నులు ఉదాసీనతను
వీడాలి ఓటరు గుర్తింపు కార్డుతో
పోలింగ్ కేంద్రాలకు కదలాలి
పట్టణ ఓటరా నిర్లక్ష్యం వద్దు
ఓటు వేయడమే ముద్దు

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
కరీంనగర్
9440245771



## ప్రజ సేవకే నా జీవితం అంకితంకౌన్సిలర్ అభ్యర్థి ఎం.డి.ఆరిఫ్

మేడ్చల్, (ప్రజాస్వరం):

20 ఎండ్లుగా కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఎల్లంపేట మున్సిపాలిటీ 23 వ వార్డు డబిల్యూర్ కౌన్సిలర్ అభ్యర్థిగా పార్టీ తనను ఎన్నికల బరిలో నిలిపిందని కౌన్సిలర్ అభ్యర్థి ఎండి ఆరిఫ్ అన్నారు. నేడు 23వ వార్డు డబిల్యూర్ లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో భారీ నామినేషన్ ర్యాలీ నిర్వహించి భారత్ బైబిల్ కాలేజీలో రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎండీ ఆరిఫ్ మాట్లాడుతూ.. తన తండ్రి పేరిట ఏర్పాటుచేసిన ట్రస్టు ద్వారా ప్రజలకు సేవా కార్యక్రమాలను చేస్తున్నట్లు చెప్పారు. తనను కౌన్సిలర్ గా గెలిపిస్తే వార్డు అభివృద్ధి, ప్రజల అవసరాలు, ప్రజాసేవకై మరింత విస్తృతంగా పనిచేస్తానని చెప్పారు. కరోనా సమయంలోను ప్రజలకు నిత్యావసర సరుకులతో పాటు అన్ని విధాల సహాయంగా ఉండటం జరిగిందని అన్నారు. నామినేషన్ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# కుమ్మర్లను బిసీ "ఏ"గ్రూపులో చేర్చాలి

కరీంనగర్/ హైదరాబాద్( ప్రజాస్వరం)

"మానవ నాగరికతకు కుమ్మరి తొలి మెట్టు ఆరోగ్యానికి కుండఆయువు పట్టు"మానవుడికి వంట నేర్పి మానవ జాతి చరిత్ర నిర్ధారణకు సంస్కృతి' వారసత్వ విశేషాల అధ్యయనానికి దోహదపడే కుమ్మర వృత్తి అంతరించే దశకు చేరుకుంది. మానవాళికి వంట వండటానికి వంట పాత్రలు సమకూర్చి మానవ జాతికి శాస్త్రీయ పరిజ్ఞానం అందించి ప్రజారోగ్యాన్ని పర్యావరణ పరిరక్షణకు ప్రతినిధిగా నిలిచిన కుమ్మర వృత్తి కార్మికులు ఉపాధిలేక దుర్భరమైన జీవితాలను వెళ్ళ దీస్తున్నారు.

**మానవ మనుగడ కుమ్మర వృత్తి**

**మనిషి పుట్టుక 'పెళ్లి'**

'చావు' .'దైవ' కార్యక్రమాల్లో కుమ్మర్ల ఉత్పతులు కుండలు' గురుగులు' వంట కొరకు ఎసులలు 'అటికెలు నీటి నిల్వకు తొట్టీలు రంజన్లు' కధువలు పెళ్ళిళ్ళలో "ఐరేని కుండలు" వినియోగిస్తారు. కుమ్మర్లవృత్తి మానవ జాతి మనుగడలో ప్రధాన పాత్ర పోషిస్తుందనడంలో అతిశయోక్తిలేదు. చారిత్రక వాస్తవం "మొహంజదారో" "హరప్పా" "మసపుటోనియా'" "సింధూ" నాగరికత అధ్యయనాలలో వెల్లడైంది. గృహ ప్రవేశం ప్రభుత్వ భవనాల భూమి పూజ 'అమ్మవారికి సమర్పించే భోనాలు' తెలంగాణ సంస్కృతిని చాటే గోల్కొండ బోనాలు"శుభ" "దైవ"కార్యక్రమాల్లో కుమ్మరి కుండలు ఉపయోగిస్తారు. మట్టిని నమ్ముకొని పర్యావరణ పరిరక్షణకు కవచంగా నిలిచిన కుమ్మర వృత్తి ఉనికిని కోల్పోయే స్థితిలో వుంది.

కుమ్మర్లు కేంద్ర' రాష్ట్ర ప్రభుత్వాల నిరాదరణకు గురై కుల వృతుల(మట్టి పాత్రలకు) ఉత్పతులకు గిరాకీ తగ్గటం వల్ల కుమ్మర వృత్తి పై ఆధారపడిన కుమ్మర్లు వృత్తిని వదిలి పట్టణాలకు వలస పోతున్నారు. అల్పవేతనాలకు పనిచేస్తూ శ్రమ దోపిడీకి గురౌతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో 14 లక్షల జనాభా కలిగి 8 లక్షల ఓటర్లు ఉన్న కుమ్మర్లు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి మద్ధత్తు ఇచ్చారు. కుమ్మర్లు తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. స్వరాష్ట్ర సాధనలోల తెగించి కొట్లాడారు. సకల జనుల సమ్మె ' మిలియన్ మార్చ్ లో కుమ్మర్లు కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. చాలా మంది కుమ్మర్లు గ్రామ 'మండల జిల్లా స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యవర్గంలో వివిధ హోదాల్లో కాంగ్రెస్ పార్టీకి అంకిత భావంతో సేవలు అందిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ విధానాలను క్షేత్ర స్థాయిలో ప్రజలవద్దకు చేర్చి పార్టీ పట్ల ప్రజల విశ్వాసాన్ని సమీకరించడంలో గణనీయమైన కృషి చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై 10 సంవత్సరాలు గడిచినా గత ప్రభుత్వం కుమ్మర్లకు చట్టసభల్లో నామినేటెడ్ పదవులు ఇవ్వలేదు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలైనప్పటికీ కుమ్మర కులస్థులు చట్ట సభల్లో నేటికి ప్రవేశించలేదు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో చట్ట సభల్లో ప్రవేశం లేని కులాలకు నామినేటెడ్ పదవులు ఇస్తామన్న రాష్ట్ర ముఖ్య మంత్రి ఎ' రేవంత రెడ్డి హామీతో కుమ్మర్లు కోటి ఆశలు పెట్టుకున్నారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 యేళ్లు ఐనప్పటికీ ఏఒక్క రాజకీయ పార్టీ అసెంబ్లీ ' లోకసభకు పోటీ చేయడానికి కుమ్మర్లకు టిక్కెట్లు ఇవ్వక పోవడం వల్ల కుమ్మర్లకు చట్ట సభల్లో ప్రవేశం లభించలేదు. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేఆర్థిక స్థోమత లేని నామినేటెడ్ పదవుల్లో కుమ్మర్లకు రాజకీయ పార్టీలు అవకాశం కల్పించక పోవడం వల్ల రాజ్యాధికారం లోవాటా కుమ్మర్లకు దక్కలేదు. కుమ్మర్లను బీ 'సీ "బి" జాబితాలోచేర్చినప్పటికీ ఆశించిన విధంగా కుమ్మర్ల సామాజిక 'ఆర్థిక 'రాజకీయ వికాసం జరుగలేదు.

**కుమ్మర్లను బి' సి 'ఏ'గ్రూపులో చేర్చాలి**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుల గణనలో కుల సర్వేలో ఆర్థికంగా సామాజికంగా ఉద్యోగ పరంగా రాజకీయంగా వెనుకబడిపోయి రెక్కాడితే డొక్కాడని కుమ్మర కులస్తులను బీ 'సీ ఏ గ్రూపులో చేర్చడానికి బీ'సీ కమిషన్ 'రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రెవంతరెడ్డి గారు చర్యలు తీసుకొని కుమ్మర కులస్థుల జీవితాలలో వెలుగులు ప్రసాదిస్తారని విజ్ఞప్తి చేస్తున్నాను.

**కుమ్మర్లకు రాజ్యాధికారంలో వాటా**

నేటి వరకు కుమ్మర్లకు రాష్ట్రం నుండి అసెంబ్లీ 'లోకసభ 'రాజ్యసభ' కౌన్సిల్ సభ్యులుగా ఒక్కరికి కూడా అవకాశం రాలేదు.

ఉత్తరాది రాష్ట్రాల్లో కుమ్మర్లను ప్రజాపతి 'కుమార్ 'కుంభార్ ' కుమావత్ ' కుంభాకార్ అనే పేర్లతో పిలుస్తారు.ఒకే దేశం ఒకే రాజ్యాంగం ఒకే చట్టం ఒకే రిజర్వేషన్ అంటూ చెబుతున్న నాయకులకు ఉత్తర' దక్షిణ 'భారత దేశ ప్రాంతాల మధ్య వివక్ష చూపడం వల్ల ప్రభుత్వాలు పార్టీలు అవలంబిస్తున్న దంద్వ వైఖరి వల్ల తెలుగు రాష్ట్రాలలో ఉన్న కుమ్మర్లు చట్ట సభల్లో ప్రవేశానికి నోచుకోలేదు.కుమ్మర్లను "ఎమ్మెల్సీ" 'కార్పొరేషన్స్ కు ఛైర్మెన్ పదవుల్లో నామినేట్ చేయక పోవడం వల్ల రాజ్యాధికారం కుమ్మర్లకు అందని ద్రాక్ష అయ్యింది.

**మట్టి కుంటల జీవో అమలు**

గతంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన మిషన్ కాకతీయ వల్ల చెరువుల్లో' 'కుంటల్లో మట్టి తవ్వకం వల్ల కుండలు చేయడానికి ఉపయోగించే బంక మట్టి కొరత ఏర్పడింది. మట్టి లభించే చెరువులు' కుంటలు రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబ్జాల్లోకి వెళ్ళటం వల్ల ఉచితంగా లభించే మట్టికి డబ్బులు చెల్లంచే పరిస్థితి వచ్చింది. కుంటల్లో చెరువుల్లో కుమ్మర్లకు ఉచితంగా మట్టి లభించే ప్రభుత్వ ఉత్తర్వులు అమలు కాలేదు.

ఉచిత కలిప జి 'వో అమలు చెయ్యాలి

కుమ్మర వృత్తికి ముడిసరుకు మట్టి కలప లభించని పరిస్థితులు దాపురించాయి.

కుమ్మర వృత్తి దారులు వలసలు కుమ్మర వృత్తి ఉత్పత్తులు కుండలు వంట పాత్రలకు మార్కెట్లో డిమాండ్ తగ్గింది వృత్తి కుదు పెట్టనిస్థితికి చేరింది.

ఈ పరిస్థితి కుమ్మర వృత్తిదారులు కుల వృత్తిని వదిలి పట్టణాలకు నగరాలకు వలసకు దారితీసింది . ఉపాధి కొరకు గల్ఫ్ దేశాలకు వలస వెళ్లారు.

**కుమ్మర వృత్తి కుదేలైంది**

ప్లాస్టిక్ 'అల్యూమినియం పాత్రలు మార్కెట్లో లభించడం వల్ల కుండలకు వంట చేసుకునే మట్టి పాత్రలకు డిమాండ్ తగ్గింది. కుమ్మర్ల రెండు రకాలుగా నష్టపోయారు.

కుండలు 'వంట పాత్రలకు కావలసిన ముడి సరుకు మట్టి కొరత ఒక వైపు మార్కెట్లో గిరాకీ తగ్గడం మరో వైపు జటిల ఆర్థిక సమస్యలుగా పరిణమించి కుమ్మర వృత్తి కుదేలైంది. "కులవృత్తిని మించింది లేదు గువ్వల చెన్న" అన్న నానుడి కుల వృత్తిని వదిలిందే మిన్న అనేది నేడు విధానమైంది.

ఉత్తరాది రాష్ట్రాల్లో కుమ్మర్లు ఎ'ఎస్సీ 'ఎస్ 'టి జాబితాలో వుండడం వల్ల అనేక రాజకీయ అవకాశాలు వచ్చాయి.అనేక మంది కుమ్మర్లు శాసన సభ్యులుగా ఎం'పి 'లుగా 'శాసన మండలి సభ్యులుగా 'మంత్రులుగా తమ ప్రతిభను చాటుతున్నారు.

ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటి వరకు చట్ట సభల్లో అవకాశం రాలేదు. ఐ 'ఎ 'ఎస్ 'ఐ'పి' ఎస్ అధికారులుగా అవకాశం రావడం లేదు. తెలంగాణ ఉద్యమంలో కుమ్మర్లు తమ "సారె "కుల వృత్తులు ప్రదర్శిస్తూ ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేశారు.అరెస్ట్ అయ్యి లాఠీ దెబ్బలు తిని జైళ్లకు వెల్లారు.

కుమ్మర్లు _ఓటుబ్యాంకు

తెలంగాణ ఏర్పడి 10 యేళ్లు ఐనప్పటికీ కుమ్మర కులస్థులకు చట్టసభల్లో ప్రవేశం లభించలేదు. రాష్ట్రంలోని119 నియోజక వర్గాల్లో అసెంబ్లీ అభ్యర్థుల గెలుపు ఓటములు నిర్ణయించడంలో గణనీయమైన ఓటు బ్యాంకు వున్న కుమ్మర్లు నామినేటెడ్ పదవుల్లో నియమించ బడలేదు. తెలంగాణ మాజీ ముఖ్య మంత్రి శ్రీ' కె చంద్ర శేఖర్ రావు చట్ట సభల్లో ప్రవేశం ప్రాతినిధ్యం లేని కులమైన కుమ్మర్లకు "ఎమ్మెల్సీ 'పదవికి నామినేట్ చేస్తానన్న హామీ నేటికీ నెరవేరలేదు. తెలంగాణలో కాంగ్రెస్ అద్వర్యంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం ఇతర కుల వృత్తులకు ఆదుకున్నట్లే కుమ్మరవృత్తి దారులను ఆదుకోవాలి.




**పీపుల్స్ ప్లాజా హైదరాబాద్లో జరిగిన "స్వదేశీ మేళాలో" విద్యుత్తు సారి పై "మట్టి పాత్రను" (ప్రమిదను)తయారు చేసే విధానాన్ని ప్రదర్శిస్తున్న' తెలంగాణ కుమ్మర సంఘం 880/2014 రాష్ట శాఖ అధ్యక్షులు' నేదునూరి' కనకయ్య.**

కుమ్మర్ల సంక్షేమ చర్యలు చేపట్టాలి.

**కుమ్మర వృత్తికి ఆధునిక సాంకేతికతను అందించాలి..**

యువతలో నైపుణ్యాభివృద్ధి కిపెద్ద పీట వేయాలి. ప్రతి మండల జిల్లా కేంద్రంలో అధునాతన పాటరీ "కలంకారీ"

ఉత్పత్తి కేంద్రాలను "స్కిల్ డెవలప్మెంట్ "ప్రోగ్రాం ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి.

కుమ్మర వృత్తి అభివృద్ధికి మౌలిక వసతులు "వాము" బట్టిల కొరకు ఉచితంగా స్థలం సమకూర్చాలి.మట్టి సేకరణ వాము కాల్చడానికి పోరుక అడవినుండి కలప

ఉచితంగా పొందడానికి ప్రభుత్వం జారీ చేసిన "జీ'వో" లు అమలు చెయ్యాలి.వాము' కొరకు కుండల' బట్టి కొరకు 'షేడ్ కొరకు ప్రభుత్వం ఉచితంగా భూమి కేటాయించాలి.

ప్రభుత్వం విధించే "సీవరేజ్ సేస్ "వృత్తి పన్ను నుండి కుమ్మర వృత్తిని మినాహాయించాలి.

చాకలి 'మంగలి వృత్తులకు ఇస్తున్న "ఉచిత విద్యుత్తు" సౌకర్యం కుమ్మర్లు ఉపయోగించే "సారె" కు వర్తింప చేయాలి. కుమ్మర్లకు గ్రామ పంచాయతీ 'మున్సిపాలిటీ' మున్సిపల్ కార్పొరేషన్లలో షాపింగ్ కాంప్లెక్స్ ల్లో వసతి ఉచితంగా కల్పించాలి. కుమ్మర్ల ఉత్పత్తులకు "రైతు బజార్లలో" స్టోరేజ్ సౌకర్యం మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలి. పాటరీ కోర్స్ ను విశ్వ విద్యాలయాలలో పాఠ్యాంశంగా చేర్చాలి. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి.

కేంద్ర ప్రభుత్వ భవిష్య నిధి పథకం ఇన్సూరెన్స్ ఆరోగ్యబీమా ప్రమాద బీమా సౌకర్యం కార్మిక మంత్రిత్వ శాఖ కుమ్మర వృత్తి దారులకు లేబర్ గుర్తింపు కార్డులు ఆరోగ్య కార్డులు ఉచితంగా ఇవ్వాలి.

**కుమ్మర్లను పూజారులుగా నియమించాలి**

ప్రభుత్వం ఎండోమెంట్స్ శాఖ ద్వార గ్రామదేవాలయలలో(పోచమ్మ 'మైసమ్మ' గ్రామ దేవతలు) కుమ్మర కులస్తులను పూజారులుగా నియమిస్తూ జీ 'వో.జారీ చెయ్యాలి.

పెన్షన్ సౌకర్యం వర్తింపచేయాలి

కుమ్మర వృత్తిదారులు పెన్షన్ సౌకర్యం కల్పించాలి. ప్రమాద బీమాపథకాన్ని ఉచిత ఆరోగ్య పథకాన్ని వర్తింపచెయ్యాలి .

విద్యుత్తు సారి ఉచితంగా ఇవ్వాలి

కుమ్మర వృత్తి దారులకు ఉచితంగా విద్యుత్తుతో నడిచే సారి( ఆదునిక పరికరం) ఇవ్వాలి.

కుమ్మర ఫైనాన్స్ ఫెరేషన్ పునరుద్ధరించాలి

రాష్ట్ర ప్రభుత్వం కుమ్మర్ల సమగ్రాభివృద్ధికి ఆర్థిక వికాసానికి వృత్తి నైపుణ్య అభివృధి దోహదపడే "కుమ్మర / శాలివాహన ఫైనాన్స్ ఫెడరేషన్ కు రూ" "2000 కోట్ల బడ్జెట్ కేటాయించాలి. కుమ్మర ఫైనాన్స్ ఫెడరేషన్ ను పునరుద్ధరించి ఫెడరేషన్ కు ఛైర్మెన్' మరియు అన్నిజిల్లాకు ప్రాతినిధ్యం ఇస్తు పాలక వర్గాన్ని నియమించి కుమ్మర్లలో 'ఆత్మ గౌరవాన్ని" పెంపొందించాలి. కుమ్మర్ల సమస్యల పరిష్కారంకోసం కుమ్మర్లలో నాయకత్వాన్ని ప్రోత్సహించే వాతావరణం కల్పించే చర్యలు తీసుకోవాలి.కుమ్మర్లను కార్పొరేషన్ పదవుల్లో నామినేట్ చేయాలి. కుమ్మర్లను రాజ్యాధికారంలో భాగ స్వాములను చేసి కుమ్మర్ల సామాజిక ఆర్థిక రాజకీయ వికాసానికి సమగ్ర అభివృద్ధి విధానాన్ని రూపొందించి అమలు చేయాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ' ఎ రేవంత్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేయనైనది. "కుమ్మర వృత్తిని రక్షించడమంటే మన జాతి నాగరికతను సంస్కృతినిరక్షించడమే" .ప్రభుత్వంకుమర్ల అభివృద్ధికి సమగ్ర చర్యలు చేపడుతుందని ఆశిద్దాం.

నేదునూరి కనకయ్య
రాష్ట్ర అధ్యక్షులు
తెలంగాణ కుమ్మర సంఘం 880/2014
కరీంనగర్
9440245771



# యూరియా కోసం బారులు తీరిన రైతులు...

చిన్న శంకరంపేట జనవరి 30 ( ప్రజాస్వరం )

చిన్న శంకరంపేట మండలంలోని మదూర్ గవలపల్లి లో యూరియా కోసం ఉదయం నుండి రైతులు దుకాణాల ముందు బారులు తీరారు, వరి నాట్లు వేసి యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నామని ఓవైపు యూరియా కొరత లేదంటూ అధికారులు సూచిస్తున్న ఇక్కడ మాత్రం యూరియా కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని రైతులు వాపోయారు, యూరియా సంచుల కోసం మహిళా రైతుల సైతం ఉదయం నుండే వరుసలు నిలబడి ఉన్నారు, నాట్లు వేయడం జరిగిందని యూరియా లేఖ వరి ఎర్రబడుతుందని ఉదయం ఇంటి వద్ద పనులను మానుకొని



యూరియా కోసం రావడం జరిగిందని అధికారులు స్పందించి రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని మహిళా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు, ఒక రైతుకు ఒక సంచి ఇవ్వడం జరుగుతుందని, మరికొన్ని చోట్ల ఒక రైతుకు రెండు సంచులు యూరియా ఇవ్వడం జరుగుతుందని, రైతులకు సరిపడా యూరియా అందించాలని రైతులు కోరారు, ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి లక్ష్మీ ప్రవీణ్ మాట్లాడుతూ మండలంలో మదూర్, శంకరంపేట, గవలపల్లి మహాలక్ష్మి ఫెర్టిలైజర్ దుకాణాలకు 1560 సంచులు రావడం జరిగిందని రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దని రైతులకు సరిపడా యూరియా అందించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి లక్ష్మీ ప్రవీణ్ తెలిపారు.




# సీఎం కప్ క్రీడలు ప్రారంభం

- తొగుట సీఐ లతీఫ్

**దౌల్తాబాద్, జనవరి 30 (ప్రజాస్వరం):** క్రీడల ద్వారా విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడోత్సవాలు ఎంతో ఉపయోగపడతాయని తొగుట సీఐ షేక్ లతీఫ్ అన్నారు. శుక్రవారం రాయపోల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సీఎం కప్ క్రీడోత్సవాలను ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమేనని, గెలిచినవారు ఆనందించాలనీ, ఓడినవారు నిరుత్సాహ పడకుండా మళ్లీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని, వారి ప్రతిభను వెలికి తీసేందుకు సీఎం కప్ క్రీడలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో రాణించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను ప్రోత్సహించారు. మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని, చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. అన్ని గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జిల్లా స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, మండల విద్యాధికారి రాజగోపాల్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మాసంపల్లి రాజు, ఉప సర్పంచ్ కుమ్మరి రాజు, ఎంపీఓ వడ్ల శివకుమార్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేకుల



నరసింహారెడ్డి, జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు స్వామి, ఉపాధ్యాయులు నాగరాజు, పీఈటీ గోవర్ధన్ రెడ్డి, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## నామినేషన్ దాఖలు చేసిన బి ఆర్ ఎస్ అభ్యర్థులు

**మేడ్చల్, (ప్రజాస్వరం):** ఎల్లంపేట మున్సిపాలిటీలో టిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు తమ నామినేషన్ దాఖలు చేశారు. 11వ వార్డు గోశిక అఖిలా సాయి, 12వ వార్డు దుడ్డు కల్పనా మాణిక్యరావు, 13వ వార్డు నుండి వీర్లపల్లి రాజమల్లారెడ్డి, భాగ్యరెడ్డి, ప్రణయ్ రెడ్డి, 14వ వార్డు నుండి గౌస్ ఖాన్, దాహూద్ ఖాన్, 23వ వార్డు నుండి వీర్లపల్లి భాగ్యరెడ్డి, జింకల నరేష్ లు నామినేషన్ పత్రాలను డబుల్ పూర్ లోని భరత్ బైబిల్ కాలేజీలో ఏర్పాటు చేసినటువంటి నామినేషన్ కేంద్రంలో రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వార్డుల అభివృద్ధికి కృషి చేస్తూ, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటామని అన్నారు. ప్రజలకు విస్తృత సేవలు చేసేందుకు బిఆర్ఎస్ పార్టీ తరఫున కౌన్సిలర్లుగా పోటీ చేస్తున్న తమను ప్రజలు గెలిపించాలని కోరారు.



## జాతిపిత మహాత్మా గాంధీకి ఘనంగా నివాళులు

**జవహర్ నగర్, జనవరి 30,(ప్రజాస్వరం):** మహాత్మా గాంధీ వర్ధంతి పురస్కరించుకొని శుక్రవారం జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని పాపయ్య నగర్ కాలనీలో గాంధీ విగ్రహానికి జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శ్రీనివాస్ పూలమాలవేసి నివాళులర్పించారు. జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి గాంధీజీ బోధనలైన సత్యం, అహింస, శాంతి, సేవ అనే సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ నిత్యం పాటించాలి. గ్రామ స్వరాజ్యం, పేదరిక నిర్మూలన వంటి గాంధీజీ ఆశయాలను నిజం చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. కార్యక్రమ లో కాలనీవాసులు,బాలు ముదిరాజ్,భారతి,మల్లేష్. మోహన్ రెడ్డి,కరుణాకర్ రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామానికి నూతన బీపీఎం నియమిస్తామని హామీ:ఐపీఓ రాహుల్

**జగదేవ్ పూర్ : జనవరి 30, (ప్రజాస్వరం)** జగదేవ్ పూర్ మండలం వట్టిపల్లి గ్రామంలో బిపిఎం లేక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.అది గమనించిన సర్పంచ్ చింతల విద్యాధర్ వారు మాట్లాడుతూ బిపిఎం కోసం ఎదురు చూడవలసిన పరిస్థితి ఏర్పడిందని శుక్రవారం గజ్వేల్ లో ఐపీఓ రాహుల్ ని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు సానుకూలంగా స్పందించి ఒకరిని ఇన్చార్జిగా నియమిస్తామని తెలిపారు. అలాగే త్వరలో బిపిఎం ను పర్మెంటుగా నియమిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యనారాయణ తదితరులు



పాల్గొన్నారు.

## బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటు కు స్థలం కేటాయించాలని ఈఓ కు వినతి పత్రం..

**నార్సింగి, జనవరి 30 ( ప్రజా స్వరం )** బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటు చేయడానికి స్థలాన్ని కేటాయించాలని పట్టణ కేంద్రానికి చెందిన స్నేహ యూత్ అసోసియేషన్, అంబేద్కర్ యూత్ అసోసియేషన్ సభ్యులు నార్సింగి ఈఓ నాగభూషణం కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్వర్గీయ బాబు జగ్జీవన్ రాం పేరొందిన స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త. రాజకీయ వేత్త అని, బీహార్ రాష్ట్రానికి చెందిన వెనుకబడిన వర్గాలనుంచి వచ్చిన నేత అని తెలిపారు. బాబూజీ గా ప్రసిద్ధి చెందిన ఆయన భారత పార్లమెంటులో నలభై ఏళ్ళ పాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించడమే కాక ఉప ప్రధాని గా కూడా వ్యవహరించారని అన్నారు. అంటరాని వారి కి సమానత్వం కోసం "ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్" అనే సంస్థను స్థాపించడం లో కీలక పాత్ర పోషించారని అలాంటి మహనీయుని జీవితం నేటి తరానికి ఆదర్శమని అన్నారు. బాబూజీ ఆశయాల సాధన కోసం విగ్రహం ఏర్పాటు చేయడం అవసరమని, బాబూజీ విగ్రహ ఏర్పాటు కోసం స్థలాన్ని కేటాయించాలని ఈఓ నాగభూషణం కు వినతి పత్రం సమర్పించామని అన్నారు. నాగభూషణం సానుకూలంగా స్పందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో చిగుళ్లపల్లి ప్రభాకర్, కందరి నవీన్, గుర్రాల రత్నం, చిగుళ్లపల్లి రాములు, కందరి రాజు, చిగుళ్లపల్లి నారాయణ, దొంతి స్వామి, నిఖిల్, తొంట శేఖర్ పాల్గొన్నారు.



## ముగిసిన నామినేషన్ ప్రక్రియ.....

- మెదక్ మున్సిపల్ లో మొత్తం 271 నామినేషన్స్....

**మెదక్ జనవరి 30 (ప్రజా స్వరం)** మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ముగిసింది. ఈ సందర్భంగా మెదక్ మున్సిపాలిటీ లో 32 వార్డుల్లో ఉండగా, ఇందులో వివిధ పార్టీల నాయకులు పోటాపోటీగా నామినేషన్ దాఖలు చేశారు. మొదటి రోజు 12 నామినేషన్లు స్వీకరించగా అందులో కాంగ్రెస్ పార్టీ (05), బిఆర్ఎస్ పార్టీ (05), బిజెపి పార్టీ (02) ల నుంచి నామినేషన్లు స్వీకరించడం జరిగింది. రెండవ రోజు 103 నామినేషన్లు స్వీకరించగా అందులో కాంగ్రెస్ పార్టీ (41), బిఆర్ఎస్ పార్టీ (36), బిజెపి పార్టీ (15), ఎంఐఎం పార్టీ (02) తరపున స్వతంత్ర అభ్యర్థులు (09) నామినేషన్లు స్వీకరించడం జరిగింది. చివరి రోజు 156 నామినేషన్లు స్వీకరించగా అందులో బీఎస్పీ పార్టీ (07), బిజెపి పార్టీ (31), కాంగ్రెస్ పార్టీ (43), ఎంఐఎం పార్టీ (06), బిఆర్ఎస్ పార్టీ (49) తరపున స్వతంత్ర అభ్యర్థులు (20) నామినేషన్లు స్వీకరించడం జరిగింది. 3 రోజుల పూర్తయ్యేసరికి కాంగ్రెస్ పార్టీ : 89, బిఆర్ఎస్ పార్టీ : 91, బిజెపి పార్టీ : 47, ఎంఐఎం : 08, బీఎస్పీ పార్టీ: 07, స్వతంత్ర అభ్యర్థులు : 29, మొత్తం: 271 దాఖలు అయ్యాయి.



## తాండూర్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

- ప్రజల్లో పలుకుబడి ఉన్న వారిని అభ్యర్థులుగా ఎన్నికల రంగంలో దించాం
- శాసనసభ్యులు మనోహర్ రెడ్డి

**తాండూరు, జనవరి 30 ( ప్రజా స్వరం ) :** తాండూర్ మున్సిపల్ పరిధిలోని అత్యధిక స్థానాల్లో విజయం సాధించి మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంటామని, స్థానిక శాసనసభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. అవినీతికి తావు లేకుండా సమర్థవంతమైన పరిపాలన చేసే అభ్యర్థులనే బరిలో నిలపడం జరిగిందని ప్రజల్లో పలుకుబడి ఉన్న వారిని ని అభ్యర్థులుగా పోటీ చేస్తున్నామని అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న రెండు సంవత్సరాలలో జరిగిన అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అన్ని వర్గాల ప్రజలతో మమేకమై పార్టీలకతీతంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని, రానున్న రోజుల్లో తాండూర్ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంటామని ఆయన తెలిపారు. వార్డ్ నెంబర్ 12 నుండి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా నీరజ బాల్రెడ్డి ఎమ్మెల్యే మనోర్ రెడ్డితో కలసి నామినేషన్ దాఖలు చేయడం జరిగింది. కార్యక్రమంలో శాసనసభ్యులు మనోహర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి మాజీ కౌన్సిలర్ నీరజ బాల్ రెడ్డి, పార్టీ నాయకులు ఉన్నారు.




## మద్యం తాగడానికి అనుమతిస్తున్న కేఫ్ నిర్వాహకుల పై కేసు నమోదు.. ఎస్సై సృజన

**నార్సింగి, జనవరి 30 ( ప్రజా స్వరం )** కఅక్రమంగా మద్యం తాగడానికి అనుమతిస్తున్న కేఫ్ నిర్వాహకుల పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బీమరి సృజన తెలిపారు. మండల పరిధిలోని జాతీయ రహదారి 44 నార్సింగి గ్రామ పరిధి లోని ఓ కేఫ్ లో మద్యం తాగడానికి అనుమతిస్తున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు గురువారం సాయంత్రం 6 గం లకు ఎస్ఐ బీమరి సృజన సిబ్బంది తో చేరుకుని కేఫ్ లో సోదాలు నిర్వహించారు. సోదాలు చేస్తున్న పోలీసులను గమనించి కేఫ్ లో మద్యం తాగుతున్న వారు పారి పోగా విషయాన్ని సుమోటో గా తీసుకుని పంచుల సమక్షం లో పంచనామ నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా, చట్ట వ్యతిరేకంగా మద్యం తాగడానికి అనుమతించిన నిర్వాహకులపై పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బీమరి సృజన తెలిపారు.

## నిబంధనలకు అనుగుణంగా నామినేషన్ ప్రక్రియ కొనసాగాలి

- సాధారణ పరిశీలకులు రవికిరణ్
- మున్సిపల్ నామినేషన్ ప్రక్రియ పరిశీలిన

**తూప్రాన్:జనవరి 30( ప్రజా స్వరం)** తూప్రాన్ మున్సిపాలిటీకి ఎన్నికల నామినేషన్ ప్రక్రియను శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు రవికిరణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ పత్రాలను, వివిధ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఎన్నికల సిబ్బందికి పలు సలహాలు సూచనలు చేశారు. ఎన్ని వార్డులు ఉన్నాయి? ఎన్ని నామినేషన్ వచ్చాయని ? సాధారణ పరిశీలకులు ఎన్నికల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఎన్నికల సంఘం నియమానిబంధనలకు అనుగుణంగా నామినేషన్ ప్రక్రియ కొనసాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జయచంద్రారెడ్డి, కమిషనర్ గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు మద్దతు

- మేడ్చల్ జిల్లా ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు జిట్టా శ్రీనివాస్ రెడ్డి

**జవహర్ నగర్,జనవరి30, (ప్రజాస్వరం):** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వ్యాప్తంగా జరిగే మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు పూర్తి మద్దతును తెలుపుతున్నామని మేడ్చల్ జిల్లా ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు జిట్టా శ్రీనివాస్ రెడ్డి అన్నారు.శుక్రవారం జవహర్ నగర్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తేనే తిరిగి అభివృద్ధి ,సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతాయని రానున్న అసెంబ్లీ ఎన్నికలకు మున్సిపల్ ఎన్నికలు మొదటి మెట్టు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్నిచోట్ల బీఆర్ఎస్ ప్రభంజనం సృష్టిస్తుందని



ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో బీఆర్ఎస్ అభ్యర్థులకు ప్రచారం నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు.

## నామినేషన్ దాఖలు చేసిన తెడ్డు యాదగిరి

**మేడ్చల్, (ప్రజాస్వరం):** మేడ్చల్ జిల్లా ఎల్లంపేట్ మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా మూడవ రోజు 7వ వార్డు నుండి తెడ్డు యాదగిరి ధర్మ సమాజ్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. శుక్రవారం డబిల్ పూర్ భారత్ బైబిల్ కాలేజీలోని నామినేషన్ కేంద్రంలో 7 వ వార్డు రావలకోల్ నుండి ధర్మ సమాజ్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా తెడ్డు యాదగిరి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా తెడ్డు యాదగిరి మాట్లాడుతూ.. ధర్మ సమాజ్ పార్టీ సహకారంతో తాను ప్రజా సేవ చేసేందుకు కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేసి ప్రజల్లోకి వస్తున్నట్లు చెప్పారు. 7వ వార్డు ప్రజలు తనను గెలిపించి ఆశీర్వదించాల్సిందిగా కోరారు. ధర్మ సమాజ్ పార్టీ సహకారంతో వార్డు అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని, ప్రజల కోసం పనిచేసే తనను ధర్మ సమాజ్ పార్టీ తరుపున కౌన్సిలర్ గా గెలిపించాలని తెడ్డు యాదగిరి ఓటర్లను అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు రాజ్ కమల్ రెడపాక ,జిల్లా మండల నాయకులు సురేష్, శివ, రవి,మాదిగ జాగృతి సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



# సీఎం కప్–2026తో షాబాద్‌లో క్రీడా పండుగ

- రూరల్ టు గ్లోబల్ నినాదంతో గ్రామీణ క్రీడలకు పెద్ద పీట
- కబడ్డీ, ఖోఖో ,వాలీబాల్ పోటీలతో మైదానం కిటకిట
- విజేతలకు బహుమతులు అందజేసిన ఎలుగంటి మధుసూదన్ రెడ్డి
- ప్రజాప్రతినిధులు, అధికారులు, సర్పంచుల ఉత్సాహభరిత హాజరు
- వందలాది మంది విద్యార్థులు, యువత భాగస్వామ్య
- సీఎం కప్ ద్వారా వెలుగులోకి వస్తున్న గ్రామీణ ప్రతిభ

**షాబాద్,జనవరి 30(ప్రజాస్వరం):**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "సీఎం కప్-2026 (సీఎం కప్)" రెండో ఎడిషన్‌ను "రూరల్ టు గ్లోబల్ - గ్రామీణ స్థాయి నుంచి ప్రపంచ స్థాయి వరకు" అనే నినాదంతో షాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ మైదానంలో ఘనంగా నిర్వహించారు. గ్రామీణ యువతలో క్రీడా ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా ఈ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ కార్యక్రమంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి క్రీడా పోటీలు నిర్వహించగా, మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన జట్లు తమ ప్రతిభను ప్రదర్శించాయి. పోటీల్లో విజేతలకు రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కప్ గ్రామీణ యువతకు ప్రభుత్వమే అందిస్తున్న గొప్ప అవకాశమని, క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ పెంపొందుతుందని పేర్కొన్నారు.



ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్దార్ మార్కెట్ చైర్మన్ సురేందర్ రెడ్డి, ఎంపీడీవో, ఎంఈఓ, వివిధ గ్రామాల సర్పంచులు ప్రభాకర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, అశోక్, లావణ్య, చెన్నయ్య, నవనీత స్వామి, శాంతమ్మ, యాదయ్య పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అలాగే పార్టీ నాయకులు, మండల స్థాయి క్రీడాకారులు, వందలాది మంది విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సీఎం కప్ ద్వారా గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగే క్రీడాకారులు వెలుగులోకి వస్తారని పలువురు అభిప్రాయపడ్డారు.








## తాండూర్ మున్సిపల్ లో బీఆర్ఎస్ విజయం ఖాయం

- మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి
- చైర్మన్ అభ్యర్థిగా 10 వ వార్డు నుంచి పట్లోళ్ల నరసింహులు నామినేషన్
- సాయిపూర్ 9వ వార్డ్ నుండి మాజీ వైస్-చైర్ పర్సన్ దీప,10వ వార్డ్ నుండి పట్లోళ్ల నర్సింహులు బరిలోకి

**తాండూరు, జనవరి 30(ప్రజా స్వరం):**
తాండూర్ మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల కార్యక్రమం లో భాగంగా శుక్రవారం సాయిపూర్ నుండి పురపాలక కార్యాలయం వరకు పెద్దసంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు , కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. నిర్వహించారు ర్యాలీగా 9,10వ వార్డుల నుండి పట్లోళ్ల దీప,పట్లోళ్ల నర్సింహులు రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి పైలెట్ రోహిత్ రెడ్డి, పార్టీ మున్సిపల్ ఎన్నికల పరిశీలకులు పంజుగల శ్రీశైల్ రెడ్డి గారుముఖ్య అతిగా పాల్గొన్నారు, తాండూరు పురపాలక పీఠం బిఅరెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని 36 వార్డులలో అత్యధిక స్థానాలలో గులాబీ జెండాను ఎగరేసి బీఅరెస్ పార్టీ బలపరిచిన చైర్మన్ అభ్యర్థి పట్లోళ్ల నర్సింహులు సారధ్యంలో మున్సిపల్ పీఠం కైవసం చేసుకుంటామని పైలెట్ రోహిత్ రెడ్డి అన్నారు. తాండూరు పురపాలక పీఠం బిఅరెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని 36 వార్డులలో అత్యధిక స్థానాలలో గులాబీ జెండాను ఎగరేసి మున్సిపల్ పీఠం కైవసం చేసుకుంటామని బిఅరెస్ పార్టీ బలపరిచిన చైర్మన్ అభ్యర్థి పట్లోళ్ల నర్సింహులు పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజు గౌడ్ సీనియర్, మాజీ మున్సిపల్ చైర్మన్ కోట్రికె విజయలక్ష్మి, నాయకులు శ్రీనివాస్ చారి తదితరులు ఉన్నారు*




## భూత్పూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్



**భూత్పూర్, జనవరి 30(ప్రజాస్వరం):**
భూత్పూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి జిఎంఆర్ ఈ సందర్భంగా నిర్వహించిన నామినేషన్ ర్యాలీలో ఎమ్మెల్యే గారితో పాటు పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజానీకం. అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ... రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి, అభివృద్ధిలో భాగ్యస్వాములు కావాలని, అభివృద్ధికి అండగా ఉండాలని భూత్పూర్ మునిసిపాలిటీ ప్రజానీకాన్ని కోరారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో భూత్పూర్ మున్సిపాలిటీలోని తండాలకు రోడ్లు వేయలేదని, భూత్పూర్ మున్సిపాలిటీ అభివృద్ధిని పట్టించుకోలేదని గత ప్రభుత్వ తీరుపై, మాజీ ఎమ్మెల్యే వైఖరి పై తీవ్రస్థాయిలో విరుచుపడ్డారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భూత్పూర్ మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ ఉంచి, మున్సిపాలిటీలోని సమస్యలను గుర్తించి రోడ్లు, డ్రైనేజీలు వ్యవస్థను మెరుగుపరచామని, ఇటీవల 20 కోట్ల నిధులతో మున్సిపాలిటీ లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. మీ అందరి ఆశీస్సులతో మున్సిపాలిటీ లోని 10కి, 10 స్థానాలు గెలుచుకుని, భూత్పూర్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ గ్రామ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు





## కుష్ఠు వ్యాధి నిర్మూలనపై నారపల్లి పీహెచ్‌సీలో అవగాహన

**ఘట్‌కేసర్,జనవరి 30(ప్రజాస్వరం):**
మెడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నారపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంవత్సరం "వివక్షతను అంతం చేయడం - గౌరవాన్ని నిర్ధారించడం" అనే అంశంతో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. కుష్ఠు వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం అధికారి శ్రీదేవి మాట్లాడుతూ, ప్రజలు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే విజయవంతంగా చికిత్స పొందుతున్న ఒక కుష్ఠు వ్యాధి బాధితుడిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారి సత్యవతి,నారపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు శోభన, జిల్లా కార్యక్రమ నిర్వహణ అధికారి సింహారాజు, పల్లె దవాఖాన వైద్యులు,ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్ర ఆర్థిక సర్వేలో తెలంగాణ ప్రగతి స్పష్టం.


- సీఎం రేవంత్ రెడ్డి పాలనకు ఆర్థిక సర్వే ముద్ర.
- దేశానికి దిక్సూచిగా తెలంగాణ.
- డా. చిన్నారెడ్డి.
- అన్ని రంగాల్లో ముందుకు తెలంగాణ.
- ఆర్థిక సర్వేతో తెలంగాణ అభివృద్ధికి ధ్రువీకరణ.



**వనపర్తి,జనవరి 30 (ప్రజాస్వరం):**
కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన తాజా ఆర్థిక సర్వే నివేదికలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో సాధిస్తున్న ప్రగతి స్పష్టంగా కనిపిస్తోందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి తెలిపారు. ఇది ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సమర్థ పాలనకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సర్వేలో తెలంగాణ అభివృద్ధి గురించి స్పష్టంగా వివరించిన సందర్భంగా శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రజల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కేంద్ర ఆర్థిక సర్వే స్పష్టం చేసిందన్నారు. గత రెండేళ్లలో తెలంగాణ అద్భుతమైన ప్రగతి సాధించిందని, సీఎం రేవంత్ రెడ్డి దూరదృష్టితో అమలు చేస్తున్న విధానాలు రాష్ట్ర భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాయని తెలిపారు. క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడంచెల విధానంతో రాష్ట్ర అభివృద్ధి స్వరూపం మారుతోందన్నారు. భూభారతి డిజిటల్ ప్లాన్ ద్వారా భూ రికార్డులు పక్కాగా మారాయని, గ్రామాలు, పట్టణాల్లో భూవివాదాలు తగ్గాయని చెప్పారు. విహబ్ ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన పెరుగుతోందన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, ఐటీ, ఫార్మా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో తెలంగాణ ముందుకు సాగుతోందని తెలిపారు. ఫ్యూచర్ సిటీ రాష్ట్రానికి మరో మైలురాయిగా నిలుస్తుందని, పట్టణాలు-గ్రామాలను సమాంతరంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. 'తెలంగాణ విజన్-2047'తో రాష్ట్ర దిశ, దశ మారుతుందని, తెలంగాణను త్రీ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని డా. చిన్నారెడ్డి పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సమర్థ పాలన భవిష్యత్తులో దేశానికి దిక్సూచిగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## నామినేషన్ దాఖలు చేసిన జక్కుల సరితకుమార్

**మేడ్చల్, (ప్రజాస్వరం):**
మేడ్చల్ జిల్లా ఎల్లంపేట్ మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా మూడవ రోజు 19వ వార్డు నుండి బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా జక్కుల సరితకుమార్ నామినేషన్ దాఖలు చేశారు.శుక్రవారం డబిల్ పూర్ భారత్ బైబిల్ కాలేజీలోని నామినేషన్ కేంద్రంలో 19 వ వార్డు సోమారం నుండి బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా జక్కుల సరితకుమార్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా జక్కుల సరితకుమార్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మల్లారెడ్డి సహకారంతోనే తాను ప్రజా సేవ చేసేందుకు కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేసి ప్రజల్లోకి వస్తున్నట్లు చెప్పారు. 19వ వార్డు ప్రజలు తనను గెలిపించి ఆశీర్వదించాల్సిందిగా కోరారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి సహకారంతో వార్డు అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని, ప్రజల కోసం పనిచేసే తనను బిఆర్ఎస్ పార్టీ తరుపున కౌన్సిలర్ గా గెలిపించాలని జక్కుల సరితకుమార్ ఓటర్లను అభ్యర్థించారు.



## నామినేషన్ల ప్రక్రియను ముగిసేవరకు 141 నామినేషన్లు దాఖలు...

**తూప్రాన్ జనవరి 30 (ప్రజాస్వరం)**
తూప్రాన్ మున్సిపాలిటీ లోని 16 వార్డులలో మూడో రోజు నామినేషన్ ప్రక్రియ ముగిసేసరికిమొత్తం 141 నామినేషన్లు దాఖలయ్యాయి అని మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి తెలిపారు 16 వార్డులలో 95 మంది అభ్యర్థులు 141 నామినేషన్లు దాకలై బిఆర్ఎస్ పార్టీ నుండి 56 నామినేషన్ రాగా కాంగ్రెస్ పార్టీ నుండి 34 నామినేషన్ వేశారు బిజెపి నుండి 23 నామినేషన్లు బిఎస్పి ఒకటి స్వతంత్ర అభ్యర్థులుగా 22 మంది నామినేషన్లు వేశారని కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి తెలిపారు.



## తిరుమలయ్య దేవాలయ నిర్మాణానికి 50 సిమెంట్ బస్తాలను విరాళంగా ఇచ్చిన ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్

**ఎర్రవల్లి,జనవరి 30(ప్రజాస్వరం):**
జోగులాంబ గద్వాల జిల్లా,ఎర్రవల్లి మండల పరిధిలోని వేముల గ్రామం అత్యంత మహిమ కలిగిన తిరుమలయ్య దేవాలయ పునః నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి.ఈ సందర్భంగా దేవాలయ నిర్మాణ పనులకు అవసరమై గ్రామస్తులు,ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అందేబోయిన వెంకటేష్ యాదవ్ ను విరాళం కొరకు సంప్రదించగా ఆయన 50 సిమెంట్ బస్తాలను విరాళంగా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాజశేఖర్,సురేష్,మాల బాబు,శివరాజు,మునిస్వామి,రాజు,లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999